Postail Licence No. L/KNL/3-19(D). 2016 - 2018

# ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :04 | సంచిక : 45 | పేజీలు 8 | వెల : 5 | గురువారం 07 ఆగష్టు 2025

ఉత్తేజిత దినపత్రిక
ఎడిటర్ : చంద్ర శేఖర్ యం
అక్షరాన్నే ఆయుధంగా మలుచుకున్న పత్రిక




వార్షికోత్సవ ప్రత్యేక సంచిక

ప్రకటనదారులకు, పాఠకులకు మా నమస్సుమాంజలులు...

16వ వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనలు మంజూరు చేయుట గురించి పాఠకులారా !.. ఉత్తేజిత దినపత్రికను హృదయపూర్వకంగా అభిమానించినందుకు మేనేజ్‌మెంట్ మీకు అభినందనలు తెలియజేస్తుంది.

జన వాక్కులే వార్తలుగా మలుచుకొని నిజాన్ని ఇజంగా చేసుకొని నిరంతరం నూతన వరవడిలో పత్రికను మీ ముందుకు తెస్తున్నామన్నా విషయం మీకందరికీ తెలిసిందే.

పత్రిక నడవాలంటే ఆర్థిక మూలాలు ముఖ్యం. కావున మీరంతా వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనలు మంజూరు చేసి పత్రికాభివృద్ధికి మీ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందజేయవలసిందిగా ఆకాంక్షిస్తున్నాము ....

మీ... ఉత్తేజిత దినపత్రిక ఎడిటర్

తారీఫ్

| | |
|---|---|
| | బ్లాక్ & వైట్ పేజి |
| బ్యాక్ కవర్ పేజి మల్టీకలర్ : 50,000/- | బ్యాక్ పేజి : 20,000/- |
| ఇన్నర్ మల్టీకలర్ పేజి : 20,000/- | ఇన్నర్ పేజి : 20,000/- |
| ఫ్రంట్ మల్టీకలర్ పేజి : 70,000/- | ఫ్రంట్ పేజి : 30,000/- |

గమనిక : సకాలంలో ప్రకటనల తాలుకా ఫోటోలు మరియు మెటీరియల్‌ను ఉత్తేజిత తెలుగు దినపత్రిక విలేకరులకు అందజేయవలసిందిగా కోరడమైనది.

ప్రకటనదారులకు విజ్ఞప్తి...




## మార్పులు స్వీకరిస్తూనే ముందుకు సాగాలి

**గ్రీన్ ఎనర్జీ' కాన్ఫరెన్స్‌లో మంత్రి లోకేశ్**

విజయవాడ: సమాజంలో నిత్యం మార్పులు వస్తున్నాయని, వాటిని స్వీకరిస్తేనే మెరుగైన ఉపాధి అవకాశాలుంటాయని ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. విజయవాడలో నిర్వహించిన 'గ్రీన్ ఎనర్జీ' కాన్ఫరెన్స్‌లో మంత్రి పాల్గొని మాట్లాడారు. కృత్రిమ మేధ క్వాంటమ్ కంప్యూటింగ్‌లో మరింత నైపుణ్యం పెంచుకోవాలన్నారు. కొన్ని కార్పొరేట్ కంపెనీలు ప్రభుత్వ ఐటీ-ఐలను దత్తత తీసుకొని, ఆధునిక సాంకేతికతపై శిక్షణ ఇస్తున్నాయని తెలిపారు. 20 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించబోతున్నాం. నా పాదయాత్రలో ఎక్కడ చూసినా మహిళా ఉద్యోగులు కనిపించారు. కియా వచ్చాక వేలమంది మహిళలకు ఉపాధి దొరికింది. పిల్లలను బాగా చదివించుకునేందుకు మహిళలు కూడా ఉద్యోగాలు చేస్తున్నారు. ఉద్యోగాలు చేస్తేనే ఇంటా బయటా వారికి గౌరవం పెరుగుతుందని మంత్రి లోకేశ్ అన్నారు.





## వైకాపా హయాంలో సింగపూర్ వెళ్లి మరీ అక్కడి మంత్రులను బెదిరించారు

అమరావతి: జగన్ ప్రభుత్వ నిర్వాకంతో సింగపూర్ ప్రభుత్వం భయపడిందని సీఎం చంద్రబాబు అన్నారు. సడలిన నమ్మకాన్ని పునరుద్ధరించేందుకు చాలా కష్టపడాల్సి వచ్చిందని చెప్పారు. మంత్రివర్గ సమావేశం ముగిసిన అనంతరం రాజకీయాంశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. పెట్టుబడుల సదస్సుకు వచ్చేందుకు సింగపూర్ ప్రభుత్వం తేలిగ్గా అంగీకరించలేదన్నారు. వైకాపా హయాంలో సింగపూర్ వెళ్లి మరీ అక్కడి మంత్రులను బెదిరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనెల 15న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభిస్తున్నట్లు సీఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులంతా పాల్గొనాలని ఆయన ఆదేశించారు. ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించక ముందే ఆటో డ్రైవర్లతో మాట్లాడాలని సీఎంకు మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు. మంచి సూచన చేశారంటూ నాదెండ్లకు చంద్రబాబు కితాబిచ్చారు.

ఆటోడ్రైవర్లతో మాట్లాడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నూతన బార్ పాలసీకి మంత్రివర్గం ఆమోదం తెలిపిన నేపథ్యంలో కల్లు గీత కార్మికులకు కేటాయించిన దుకాణాల్లో బినామీలు వస్తే సహించబోనని సీఎం హెచ్చరించారు.మంత్రులు మెరుగ్గా పనిచేశారు.. ఇక దూకుడు పెంచాలి"మంత్రులు ఏడాదిగా సబ్జెక్టు నేర్చుకుంటూ మెరుగ్గా పనిచేశారు. ఇక హనీమూన్ కాలం వదిలి పాలనలో దూకుడు పెంచాలి.

తప్పుడు వార్తల ప్రచారం, వైకాపా కుట్రలు, అతి తెలివైన నేరగాళ్ల పట్ల పూర్తి అప్రమత్తంగా ఉండాలి. మహిళలపై అసభ్య వ్యాఖ్యలను గట్టిగా తిప్పికొట్టాలి. అంతర్జాతీయ సంబంధాలకు మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేస్తాం. సింగపూర్ విధానాల స్టడీకి మంత్రులు దశలవారీగా అక్కడికి వెళ్లాలి. ప్రభుత్వం పట్ల ప్రజల్లో పూర్తి సానుకూలత ఉంది. మంత్రుల పనితీరుతో అది మరింత పెరగాలి. ఎమ్మెల్యేలతో మాట్లాడా.. పొరపాట్లు సరిదిద్దుకుంటామని చెప్పారు.



2లో

## నూతన బార్ పాలసీకి మంత్రివర్గం ఆమోదం

**ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం**

**'స్త్రీశక్తి' పథకానికి 15న రాష్ట్రవ్యాప్తంగా శ్రీకారం**

**అరకు, భవానీ ఐలాండ్స్‌లో మరిన్ని సౌకర్యాలు**

**వైష్ణవి ఇన్‌ఫ్రా కంపెనీకి 25 ఎకరాల తితిదే భూమి**

**40వేల హెయిర్ కటింగ్ షాపులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్**

**సింగపూర్‌లో జగన్ అక్కడి మంత్రులను బెదిరించారన్న చంద్రబాబు**

**కేబినేట్ సమావేశ వివరాలు వెల్లడించిన మంత్రి పార్థసారథి**



## ఈపీఎస్ కనీస పింఛనుపై త్వరలో ప్రకటన.. విశాఖ ఎంపీకి తెలిపిన కేంద్రమంత్రి

విశాఖపట్నం: ఈపీఎస్-95 పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కేంద్రమంత్రి మన్‌సుఖ్ మాండవీయను విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్ కోరారు. ప్రభుత్వం రంగ సంస్థలు (పీఎస్‌యూ), ప్రైవేట్ రంగాల నుంచి పదవీ విరమణ చేసిన వేల మంది ఉద్యోగులు తక్కువ పెన్షన్‌తో జీవితాన్ని కొనసాగిస్తున్నారని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పెన్షన్ మొత్తం పెంపు, చెల్లింపుల వేగవంతం తదితర అంశాలను పరిష్కరించాలని కోరారు. దీనిపై స్పందిస్తూ.. పెన్షనర్లకు కనీస పెన్షన్ నిర్ణయంపై కేంద్రం త్వరలో కీలక ప్రకటన చేస్తుందని ఎంపీకి కేంద్రమంత్రి హామీ ఇచ్చారు.



## బీసీల రిజర్వేషన్ల బిల్లును సాధించి తీరుతాం

2లో

**బిసి రిజర్వేషన్లపై మీకెందుకు కక్ష**

**తెలంగాణపై గుజరాతీల పెత్తనం ఏంది?**

**42శాతం రిజర్వేషన్లు ఇస్తారా..గద్దె దింపాలా?**

**మోడీపై నేరుగా విమర్శలు గుప్పించిన సిఎం రేవంత్**

**ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద ధర్నాల ఉద్వేగ పూరిత ప్రసంగం**

**బిజెపి, బిఆర్ఎస్ తీరును తూర్పారా పట్టిన రేవంత్ రెడ్డి**

## కాంగ్రెస్ ఢిల్లీ ధర్నా అట్టర్ ఫ్లాప్

హైదరాబాద్: బీసీలకు 42శాతం కోటా పేరిట సీఎం రేవంత్ రెడ్డి అండ్ బ్యాచ్ ఢిల్లీ వెళ్లిన చేసిన డ్రామా అట్టర్ ఫ్లాప్ అయ్యిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. ఢిల్లీ వేదికగా నిర్వహించిన దొంగ దీక్షకు.. కూతవేటు దూరంలో ఉండి రాహుల్ గాంధీ రాలేదని.. మాకు బీసీల కన్నా బిహారే ముఖ్యమని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే రాలేదని తెలిపారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సీఎం రేవంత్ రెడ్డి నిర్వహించిన బీసీ ధర్నాపై హరీశ్‌రావు ఎక్స్ వేదికగా విమర్శలు గుప్పించారు. మీ ధర్నాలో నిజాయితీ లేదని, బీసీలకు 42శాతం కోటా అమలు చేస్తారనే మాటలపై నమ్మకం రాహుల్ గాంధీ, ఖర్గే లతో పాటు-, తెలంగాణ ప్రజలకు కూడా లేదని సుస్పష్టం అయ్యిందని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. మేం గుజరాత్ లో అడగలేదు, ఉత్తర్ ప్రదేశ్ లో అడగలేదు, మహారాష్ట్రలో అడగలేదు తెలంగాణలోనే బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అడుగుతున్నాం అని రేవంత్ రెడ్డి ప్రసంగిస్తే.. అదే సమయంలో రాహుల్ గాంధీ గారూ.. ఈ పోరాటం తెలంగాణ కోసం మాత్రమే కాదు, యావత్ దేశం కోసం చేస్తున్న పోరాటం అని ట్వీట్ చేస్తరు. ఒకే రోజు, ఒకే సమయంలో సీఎం రేవంత్ రెడ్డి చెప్పిన మాటలకు, రాహుల్ గాంధీ చెప్పిన మాటలకే పొంతన లేదని విమర్శించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ మీద కాంగ్రెస్ పార్టీకి ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో రెండు నాల్కల ధోరణి చూస్తేనే అర్థమవుతున్నదని అన్నారు.మీరు ప్రజలను కొన్నిసార్లు మోసం చేయవచ్చు లేదా కొంతమంది ప్రజలను అన్నిసార్లు మోసం చేయవచ్చు. కానీ అందర్నీ అన్ని సమయాల్లో మోసం చేయలేరు ' అని అబ్రహం లింకన్ చెప్పిన నీతి వాక్యాన్ని ఈ సందర్భంగా హరీశ్‌రావు ప్రస్తావించారు. ఇదిలావుంటే సీనియర్ శాసనసభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించిన తీరును మాజీమంత్రి హరీశ్‌రావు ఖండించారు. ఇందిరమ్మ రాజ్యం అని గొప్పలు చెప్పుకొంటూ మహిళా సభ్యురాలి పట్ల కర్కశంగా వ్యవహరించడం సిగ్గుచేటని మండిపడ్డారు. రేషన్ కార్డుల విషయంలో ప్రభుత్వాన్ని నిలదీయడమే సబిత చేసిన తప్పా అని ప్రశ్నించారు. మంత్రి సమక్షంలోనే కాంగ్రెస్ నాయకులు వీధి రౌడీలుగా బెదిరింపులకు పాల్పడుతుంటే అడ్డుకోవాల్సిన పోలీసులు వారితో కలిసి మహిళా ఎమ్మెల్యేపై దౌర్జన్యానికి పాల్పడటం దుర్మార్గమని విమర్శించారు. ఆమెపై అనుచితంగా ప్రవర్తించిన పోలీసులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ తాటాకు చప్పుళ్లు, రౌడీ మూకల దాడులకు భారత రాష్ట్ర సమితి భయపడదన్నారు. ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామని, ప్రజాక్షేత్రంలో వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటామని హరీశ్‌రావు తెలిపారు.

## గాంధీ కుటుంబాన్ని పొగడడానికే బిసి ధర్నా

న్యూఢిల్లీ: జంతర్‌మంతర్‌లో కాంగ్రెస్ పార్టీ పెట్టుకున్న సభ.. గాంధీ కుటుంబాన్ని పొగడటానికే సరిపోయిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో రాజకీయంగా ఎదురవుతున్న ఒత్తిడిని తట్టుకునేందుకు.. గాంధీ కుటుంబం అనుగ్రహం పొందాలన్న లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ సభ పెట్టుకున్నారని ఆరోపించారు. ఢిల్లీలో తెలంగాణ కాంగ్రెస్ నాయకులు చేస్తున్న బీసీ ధర్నాపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. సీఎం రేవంత్ రెడ్డి 31 నిమిషాల ప్రసంగంలో.. 50 శాతం కంటే ఎక్కువ సమయం రాహుల్, సోనియా జపం చేయడానికే సరిపోయిందని కిషన్ రెడ్డి విమర్శించారు. బీసీ రిజర్వేషన్లు ఇస్తామని తెలంగాణ ప్రజలకు హామీ ఇచ్చారు.. దాన్ని పూర్తిచేసుకోవాల్సిన బాధ్యత కూడా కాంగ్రెస్ దే అని ఆయన ఉద్ఘాటించారు. అందుకోసం న్యాయపరమైన, చట్టపరమైన అంశాలపై దృష్టిసారించి, చిత్తశుద్ధితో పనిచేయాలని హితవు పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వం అది చేయలేక.. బట్టకాల్చి బీజేపీ మీద వేస్తామంటే చూస్తు ఊరుకోమని కిషన్ రెడ్డి వార్నింగ్ ఇచ్చారు. చట్టపరమైన, న్యాయపరమైన ప్రణాళిక లేకుండా.. కామారెడ్డి డిక్లరేషన్‌ను రాహుల్ గాంధీ ప్రకటించారని గుర్తు చేశారు. 18 నెలలు గడుస్తున్న సీఎం రేవంత్ రెడ్డి డిక్లరేషన్‌లో పేర్కొన్న అంశాల అమలు ఊసెత్తడం లేదని ఆయన ప్రశ్నించారు. ప్రధాని నరేంద్ర మోదీని రేవంత్ రెడ్డి విమర్శిస్తే.. అది ఆకాశం మీద ఉమ్మేయడమే అని కిషన్ రెడ్డి విర్శించారు. వివిధ కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు- చేయాలి కానీ ఆ దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని అన్నారు. రజకులు, గౌడ్లు.. ఇలా ఏ ఒక్క బీసీ వర్గాన్ని వదలకుండా అందరినీ కాంగ్రెస్ నిట్టనిలువునా మోసం చేసిందని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే.. కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత బయటపడుతుందని నిర్వహించడం లేదన్నారు. రిజర్వేషన్ల పేరుతో డ్రామాలు ఆడుతున్నారు తప్ప.. సీఎం రేవంత్‌కు బీసీలకు సాధికారత కల్పించే విషయంలో చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. తెలంగాణలో ధర్నా చేస్తే.. ఎవరూ పట్టించుకోరని.. ఢిల్లీకి వచ్చి పగటివేషాలు వేస్తున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఎవరు అధికారంలో ఉన్నా.. మజ్లిస్ పార్టీ చెప్పినట్లు- పనిచేస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. అధికారికంగా 10శాతం ముస్లింలను బీసీల్లో చేర్చి 42శాతం రిజర్వేషన్ అమలు చేస్తే.. బీసీలకు రాజ్యాధికారం కష్టమేననేది తెలంగాణ సమాజానికి అర్థమైందన్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ ముస్లింలతో కూడిన బీసీ రిజర్వేషన్లను బీజేపీ అంగీకరించదని తేల్చి చెప్పారు. దేశంలో మోదీ నేతృత్వంలో ప్రజలకు సుస్థిరమైన పాలన అందుతోందని కిషన్ రెడ్డి చెప్పుకొచ్చారు.

## పార్టీ ఆదేశాల మేరకు పనిచేశా

నాగర్ కర్నూలు:గతంలో బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఏం ఆదేశిస్తే అదే తాను చేశానని బీఆర్ఎస్‌ను వీడిన మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు.. ఆ పార్టీపై సంచలన వ్యాఖలు చేశారు. పేదరిక నిర్మూలన.. ప్రజల పక్షమే తన పంతమని పేర్కొన్నారు. తనకు.. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అది
నాయకత్వం నుంచి పిలుపు వచ్చిందన్నారు. కానీ తన వాయిస్ ప్రజల పక్షాన బతికి ఉండాలంటే.. స్వేచ్ఛ ఉన్న పార్టీ తనకు కావాలని పేర్కొన్నారు. తొందరలో తన దారి ఏమిటో నిర్ణయిస్తానని స్పష్టం చేశారు. బుధవారం నాగర్ కర్నూలులో గువ్వల బాలరాజు విలేకర్లతో మాట్లాడుతూ.. అసమర్థ నాయకత్వం కుట్రలు చేసి తనను ఓడించిందంటూ బీఆర్ఎస్ పార్టీపై మండిపడ్డారు. అన్యాయాన్ని ఎదిరించే పాత్రను ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీ పోషించడం లేదన్ని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్యకర్తలకు కష్టకాలంలో పార్టీ అధినాయకత్వం అండగా ఉండాలని అభిప్రాయపడ్డారు. ప్రజలు ఏమి ఆశిస్తున్నారో అది చేయకుండా.. అధికార, ప్రతిపక్ష పార్టీలు మాటల యుద్ధం చేసుకుంటున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో జీబీఆర్ రూ. 100 కోట్లకు అమ్ముడు పోలేదని స్పష్టం చేశారు. గువ్వల బాలరాజు అంటేనే ఒక సెన్సేషన్..జీబీఆర్ ఉన్నది ఉన్నట్టుగా మాట్లాడకూడదంటే ఒప్పుకోడంటూ తన అభిప్రాయాన్ని ఈ సందర్భంగా కుండ బద్దలు కొట్టారు. తనతో కలిసి రవాలంటూ ప్రజలకు ఈ సందర్భంగా గువ్వల బాలరాజు పిలుపునిచ్చారు. భారత రాష్ట్ర సమితికి మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఆగస్ట్ 4వ తేదీ అంటే సోమవారం రాజీనామా చేశారు. ఆ రాజీనామా లేఖను ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు పంపారు. నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా బాలరాజు ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఆ పదవికి సైతం ఆయన రాజీనామా చేశారు. బిఆర్ఎస్‌కి మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సోమవారం రాజీనామా చేశారు. ఆ రాజీనామా లేఖను ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు పంపారు. ఆ లేఖలో ఆయన కీలక విషయాలను ప్రస్తావించారు. పార్టీకి కు రాజీనామా నిర్ణయం అంత ఈజీగా తీసుకున్నది కాదన్నారు. ఎంతో ఆలోచించి.. ఎన్నో విషయాలను పరిగణలోకి తీసుకుని అనంతరం బాధతో పార్టీని వీడుతున్నట్లు- ఆ లేఖలో పేర్కొన్నారు. అయితే గత రెండు దశాబ్దాలుగా కేసీఆర్ నాయకత్వంలో పని చేయడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఆ సమయంలో తాను ఎన్నో విషయాలు నేర్చుకున్నానని పేర్కొన్నారు.

# ట్రంప్ అదనపు సుంకాలపై మండిపడ్డ భారత్




న్యూఢిల్లీ: భారత్ ఉత్పత్తులపై అదనపు సుంకాలు విధిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయాన్ని భారత్ తీవ్రంగా ఖండించింది. దీన్ని దురదృష్టకరమైన చర్యగా పేర్కొంది.అదనపు సుంకాల విధింపును అన్యాయం, అసమంజసమైనవిగా భారత విదేశాంగశాఖ తన ప్రకటనలో పేర్కొంది. జాతీయ ప్రయోజనాలను కాపాడుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది.
రష్యా నుంచి భారత్ చమురు దిగుమతులను అమెరికా లక్ష్యంగా చేసుకుంది. ఈ వ్యవహారంపై మా వైఖరిని ఇప్పటికే స్పష్టం చేశాం. మార్కెట్ అంశాలపై ఆధారపడే మా దిగుమతులు ఉన్నాయి. 140 కోట్లమంది దేశ ప్రజల ఇంధన భద్రతను నిర్ధారించడం మా బాధ్యత. ఇతర అనేక దేశాలు తమ సొంత ప్రయోజనాల కోసం చర్యలు తీసుకుంటున్నప్పటికీ.. భారత్‌పై అదనపు సుంకాలను విధించాలని అమెరికా నిర్ణయించడం దురదృష్టకరం. ఈ చర్యలు అన్యాయం, అసమంజసమైనవని పునరుద్ఘాటిస్తున్నాం. మా జాతీయ ప్రయోజనాలను కాపాడుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటాం అని భారత విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. రష్యా నుంచి చమురు కొనుగోళ్లు జరుపుతున్న భారత్‌పై మరో 25 శాతం సుంకం విధిస్తున్నట్లు- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇప్పటికే భారత్‌పై 25 శాతం ప్రతీకార సుంకం విధించారు. దీంతో భారత్ నుంచి దిగుమతయ్యే ఉత్పత్తులపై 50 శాతం సుంకం వర్తించనుంది. ఈ మేరకు బుధవారం ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై ట్రంప్ సంతకం చేశారు. రష్యా చమురు కొనుగోళ్ల విషయంలో అక్కసు వెళ్లగక్కుతున్న ట్రంప్.. 24 గంటల్లో భారత్‌పై భారీ టారిఫ్ వేస్తానని మంగళవారం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే తాజా చర్యలు తీసుకున్నారు. ఇదిలావుంటే తాజా పరిణామంపై కాంగ్రెస్ స్పందించింది. నరేంద్ర మోదీ మిత్రుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై మొత్తంగా 50 శాతం సుంకం విధించారని తెలిపింది. ట్రంప్ నిరంతరం మన దేశంపై చర్యలు తీసుకుంటు-న్నా.. ప్రధాని మోదీ మాత్రం కనీసం ఆయన పేరును కూడా ప్రస్తావించడం లేదంటూ విమర్శించింది. ఇప్పటి-కై-నా
ప్రధాని మోదీ ధైర్యం చూపించాలని, ట్రంప్ చర్యలకు తగిన సమాధానం ఇవ్వాలని కోరుతూ 'ఎక్స్'లో పోస్టు పెట్టింది.

# నూతన బార్ పాలసీకి మంత్రివర్గం ఆమోదం




అమరావతి: రాష్ట్రంలో నూతన బార్ పాలసీకి మంత్రివర్గం ఆమోదం తెలిపిందని ఏపీ సమాచార, ప్రసారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. 'స్త్రీ శక్తి' పేరుతో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందన్నారు. మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మీడియాకు పార్థసారథి వెల్లడించారు. బుధవారం వెలగపూడిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు కీలక అంశాలను ప్రస్తావించడంతోపాటు- తమ సింగపూర్ పర్యటనకు సంబంధించిన అంశాలను ఈ సందర్భంగా మంత్రులతో సీఎం చంద్రబాబు పంచుకున్నారు. పర్యాటక రంగంలో పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నామని.. అరకు, భవానీ ఐలాండ్స్‌లో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని మంత్రి చెప్పారు. రూ.900 కోట్ల ఏపీ బీడీసీఎల్ రుణాలకు ప్రభుత్వ హామీకి మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. వైష్ణవి ఇన్‌ఫ్రా కంపెనీకి 25 ఎకరాల తితిదే భూమిని ఇచ్చేందుకు క్యాబినెట్ అనుమతి ఇచ్చినట్లు వెల్లడించారు. బీసీ వర్గాల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని చెప్పారు. మత్స్యకారులు, నాయీ బ్రాహ్మణులకు గౌరవ వేతనం పెంచామన్నారు. 40వేల హెయిర్ కటింగ్ షాపులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు- తెలిపారు. స్త్రీ శక్తి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని ప్రారంభిస్తున్నామని.. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని కేబినెట్ మంత్రులను సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. అయితే ఆగస్ట్ 15వ తేదీ.. స్వాతంత్ర దినోత్సవమని.. ఆ రోజు చాలా కార్యక్రమాలు ఉంటాయని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకు మంత్రులు విన్నవించారు. కానీ టైమ్ అడ్జెట్ చేసుకుని ఈ కార్యక్రమానికి తప్పకుండా హాజరుకావాలని వారికి సీఎం సూచించారు. ఇక ఈ కేబినెట్ సమావేశంలో కొత్త బార్ పాలసీను ఆమోదించారు. అయితే కల్లు గీత కార్మికుల కోసం కేటాయించిన షాపుల్లో బినామీలు వస్తే సహించనని హెచ్చరించారు. ఆర్టీసీ బస్సుల్లో స్త్రీలకు ఉచిత ప్రయాణం ప్రారంభానికి ముందే.. ఆటో డ్రైవర్లను పిలిపించి వారితో మాట్లాడాలని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ సమావేశంలో సూచించారు. ఈ సూచనపై సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. ఆటో డ్రైవర్లను వెంటనే పిలిపించి వారితో సమావేశం ఏర్పాటు- చేయాలని అధికారులకు సీఎం ఆదేశించారు. వారితో మాట్లాడి తగిన సహాయం చేయాలని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా సూచించారు.వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ దెబ్బకు సింగపూర్ వాళ్లు ఎట్టి పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్‌కు రానని చెప్పారన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో వారు.. అక్కడికి వెళ్లి సింగపూర్ మంత్రులను బెదిరించారని చెప్పారు. కేసులు పెడతామని బెదిరించి వాళ్లను భయపెట్టే పరిస్థితి జరిగిందని తెలిపారు. అలాగే సీడ్ క్యాపిటల్‌లో తాము భాగస్వామ్యం కాబోమని వారు స్పష్టం చేశారని పేర్కొన్నారు. పార్టనర్ షిప్ సమ్మిట్‌కు వాళ్లని రమ్మని ఆహ్వానించామని తెలిపారు. స్నేహ సంబంధాలు కొనసాగించాలని వారిని సూచించినట్లు- పేర్కొన్నారు. అందుకు వాళ్లు సైతం ఒప్పుకున్నారని చెప్పారు.. సింగపూర్ పర్యటనలో భాగంగా మొత్తం 41 సమావేశాల్లో పాల్గొన్నానన్నారు. బ్రాండ్ ఆంధ్రప్రదేశ్ ప్రమోషన్‌లో భాగంగా ఏపీకి పెట్టు-బడులు ఆకర్షించడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు జులై 26 నుంచి 31వ తేదీ వరకు సింగపూర్‌లో పర్యటించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా పలు దిగ్గజ సంస్థల ప్రతినిధులు, కంపెనీ సీఈఓలు, పారిశ్రామికవేత్తలతో ఆయన వరుసగా భేటీ-లు నిర్వహించారు.
ఆ క్రమంలో పెట్టు-బడులు పెట్టేందుకు రాష్ట్రంలో ఉన్న అవకాశాలు, వనరులు, ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు, పారిశ్రామిక పాలసీ, భూమి లభ్యత తదితర అంశాలను వారికి సీఎం చంద్రబాబు సోదాహరణగా వివరించారు.
ఇక ఈ ఏడాది నవంబర్‌లో విశాఖపట్నం వేదికగా పెట్టు-బడుల సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సుకు సింగపూర్‌లోని పారిశ్రామికవేత్తలను సీఎం చంద్రబాబు ఆహ్వానించారు. అలాగే ఈ పర్యటనలో భాగంగా రౌండ్ టేబుల్ సమావేశాలు సైతం నిర్వహించారు. అదే విధంగా ఆ దేశంలోని వివిధ మౌలిక సదుపాయాలు, లాజిస్టిక్ సంస్థలను సీఎం చంద్రబాబు సందర్శించిన విషయం విదితమే. ఈ సింగపూర్ పర్యటనలో సీఎం చంద్రబాబు వెంట.. మంత్రులు నారా లోకేష్, టీ-జీ భరత్, పి నారాయణతోపాటు- పలువురు ఉన్నతాధికారులు ఉన్నారు.

# బీసీల రిజర్వేషన్ల బిల్లును సాధించి తీరుతాం



న్యూఢిల్లీ,ఆగస్ట్6(ఆర్ఎన్ఎ): బీసీ రిజర్వేషన్ల బిల్లులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపకపోతే.. ప్రధాని మోడీని గద్దెదించి, రాహుల్ గాంధీని ప్రధానిని చేసుకుని బీసీ రిజర్వేషన్లు సాధించుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రధాని మోడీ మెడలు వంచేందుకే ఢిల్లీలో మహాధర్నా చేపట్టామని.. కేంద్ర ప్రభుత్వం బీసీ బిల్లులకు ఆమోదం తెలకపపోతే ప్రధాని మోడీని గద్దె దింపుతామని హెచ్చరించారు. బీజేపీ మాతృ సంస్థ ఆర్ఎస్ఎస్ చెప్పినా మోడీ ప్రధాని పదవి వదులుకోవడం లేదని.. 75 ఏళ్ల నిబంధన ఆయనకి వర్తించదా అని ప్రశ్నించారు. మోడీ గద్దె దిగినా.. దిగకపోయినా.. 2029లో మేమే ఆయనను గద్దె దింపి.. రాహుల్ గాంధీని ప్రధానిని చేసుకుంటామని..ఇదే మా శపథమని ఘాటు వ్యాఖ్యలు చేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని 150 సీట్లకే పరిమితం చేస్తామని సవాల్ విసిరారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను కేంద్ర ప్రభుత్వం ఆమోదించాలని డిమాండ్ చేస్తూ టీ-పీసీసీ ఆధ్వర్యంలో బుధవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ దగ్గర మహాధర్నా చేపట్టారు. ఈ ధర్నాలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..రిజర్వేషన్లు 42 శాతం ఇవ్వాలని రెండు బిల్లులను ఆమోదించాం. ఆనాటి సీఎం కేసీఆర్ బీసీలపై కక్ష్య గట్టి తెలంగాణలో 50 శాతం మించకుండా చట్టం చేశారు. బలహీన వర్గాలకు అన్యాయం చేసే చట్టాన్ని తొలగించేందుకు ఆర్డినెన్స్ తీసుకొచ్చాం. విద్యా, ఉద్యోగాలు, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్ల బిల్లును చట్టం చేసి గవర్నర్ రాష్ట్రపతికి పంపించారు. 50 శాతం క్యాప్‌ను తొలగించే ఆర్డినెన్స్ కూడా రాష్ట్రపతి దగ్గరకు వచ్చింది. నాలుగు నెలలు గడిచినా ఆమోదం లేదు. బీసీలకు అన్యాయం చేస్తుంటే గల్లీ నుంచి ఢిల్లీకి వచ్చి ధర్నా చేపట్టాం అని అన్నారు. హైదరాబాద్‌లో, తెలంగాణలో చేస్తే తెలంగాణ వ్యాప్తంగా ఉన్న పార్టీల మద్దతు మాత్రమే ఉంటుంది. ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద చేస్తే దేశ వ్యాప్తంగా ఉన్న పార్టీల మద్దతు ఇస్తున్నారు. అదే విధంగా ఇండియా కూటమి పార్టీలు, నేతలు కూడా మద్దతు ఇస్తున్నారు. తెలంగాణ కోసం పార్లమెంటులో మోదీ సర్కార్?తో కొట్లాడుతామని ధర్నాకు వచ్చి అండగా నిలిచారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు జోడో యాత్ర చేసి దేశానికి రాహుల్ హామీ ఇచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో కులగణన చేస్తామని తెలంగాణ ప్రజలకు హామీ ఇచ్చారని అంటూ, ఆ హామీ మేరకు 42శాతం చట్టం చేశామని అన్నారు. కామారెడ్డిలో 42 శాతం బీసీ డిక్లరేషన్ ఇచ్చాం. రాహుల్ గాంధీ, సిద్ధరామయ్య కామారెడ్డిలో హామీ ఇచ్చారు. ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఏ ఒక్క ముఖ్యమంత్రి చేయని సాహసం మేము చేశాం. కేబినెట్ మంత్రులు నాకు అండగా నిలిచి 300 మంది సీఎంలు చేయలేని పనిని చేసే అవకాశం నాకు కల్పించారు. దేశానికే ఆదర్శంగా నిలబడటానికి తెలంగాణ సీఎంగా నాకు అవకాశం వచ్చింది. రాహుల్ గాంధీ సందేశాన్ని అందిపుచ్చుకుని.. జనగణనలో కులగణన చేయాలని నిర్ణయించాం అని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల బిల్లులకు ఆమోదం తెలపాలని డిమాండ్ చేశారు. మోడీ సర్కార్ బిల్లులకు ఆమోదం తెలిపే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ, భాజపా నేతలు బీసీ రిజర్వేషన్ బిల్లులను అడ్డుకొని బలహీనవర్గాలకు అన్యాయం చేస్తున్నారని రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో బీసీ రిజర్వేషన్లు ఇస్తామంటే గుజరాత్ వారికి కడుపుమంట ఎందుకని ఆగ్రహం వ్యక్తం చేశారు. గల్లీలో ఉండలేక దిల్లీలోనే తేల్చుకుందామని 'చలో దిల్లీ' చేపట్టామని చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఎలాగైనా సాధిస్తామన్నారు. దిల్లీలో ధర్నాకు వంద మంది ఎంపీలు, ఇండియా కూటమి పార్టీలు మద్దతు ఇచ్చాయన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం 4 కోట్ల మంది ముక్త కంఠంతో విజ్ఞప్తి చేశారు. జంతర్ మంతర్ వేదికగా మోదీ, ఎన్డీయేకు సవాల్ విసురుతున్నా. మా డిమాండ్‌ను ఆమోదిస్తారా?మిమ్మల్ని గద్దె దించాలా? మా ఆలోచనలు, బిల్లులను తుంగలో తొక్కే అధికారం మీకు ఎవరిచ్చారు? మోదీ మన బద్ధశత్రువు.. బలహీనవర్గాలకు న్యాయం చేసే ఆలోచన ఆయనకు లేదు. ఆయన మోచేతి నీళు తాగే కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రామచంద్రరావుకు ఏమైంది?తెలంగాణలో మీరు బలహీనవర్గాలను ఓట్లు అడగలేదా?ప్రజలతో మీ అవసరం తీరిపోయిందా?పేరు బంధం తెగిన తెరాస పేగు బంధం కూడా తెలంగాణతో తెగిందా అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఈసందర్భంగా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై మరోసారి విరుచుపడ్డారు సీఎం రేవంత్ రెడ్డి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కాంగ్రెస్ ప్రభుత్వం సంకల్పిస్తే.. ఆ రెండు పార్టీలు మోకాలడ్డేస్తున్నాయని ఫైర్ అయ్యారు. బలహీన వర్గాలకు రిజర్వేషన్లు ఇవ్వాలని అసెంబ్లీలో మేం బిల్లులు ఆమోదిస్తే.. మా బిల్లును తుంగలో తొక్కే హక్కు మీకు ఎవరిచ్చారని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బీసీ పేరుతో కాంగ్రెస్ డ్రామాలేస్తుందని డ్రామారావు అంటుండు. కానీ డ్రామాలు ఆడేదే కల్వకుంట్ల ఫ్యామిలీ అని తెలంగాణ రాష్ట్రమంతా తెలుసని రేవంత్ కౌంటర్ ఇచ్చారు. డ్రామా మీ కుటుంబంలో ఉంటే.. బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలనే చిత్తశుద్ధి మాకుందన్నారు.

## యూపిఐ పేమెంట్లకు ఛార్జీలు తప్పవా?




ముంబై:యూపీఐ సర్వీసులు ఎప్పటికీ ఉచితంగానే అందుబాటులో ఉంటాయా? అన్న ప్రశ్నకు రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పందించారు. ఎంపీసీ నిర్ణయాల ప్రకటన తర్వాత ఆయన మీడియాతో ఆయన మాట్లాడారు. డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను నడిపేందుకు అయ్యే ఖర్చును కాలక్రమేణా ఎవరైనా భరించాల్సి ఉంటుందన్నారు. యూపీఐ సర్వీస్‌లు ఎప్పుడూ ఉచితంగానే అందుబాటులో ఉంటాయన్న విషయం తాను చెప్పలేనన్నారు. ఆపరేషన్‌కు సంబంధించిన ఖర్చులు ఉన్నాయని.. ఖర్చును ఎవరైనా భరించాల్సి ఉంటుందన్నారు. ఎవరు చెల్లిస్తారనేది ముఖ్యమని.. కానీ ఎవరు చెల్లిస్తున్నారనే ముఖ్యం కాదన్నారు. ఈ మోడల్ స్థిరత్వం, సమష్టిగా, వ్యక్తిగతంగా ఆపరేషన్ కోసం చెల్లింపులు ముఖ్యమన్నారు. యూపీఐ వ్యవస్థపై విధిస్తున్న చార్జీలపై నివేదికల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

## ఉత్తరాఖండ్ వరదల్లో 28మంది కేరళ పర్యాటకుల గల్లంతు



డెహ్రాడూన్:ఆకస్మిక వరదలతో ఉత్తరాఖండ్‌లో తీవ్ర విషాదం నెలకొంది. మంగళవారం ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశి జిల్లాలోని ధరాలి, సుఖీ అనే గ్రామాలను వరదలు ముంచెత్తాయి. భారీ వర్షం కారణంగా మెరుపు వరద ధరాలి గ్రామాన్ని సగం తుడిచిపెట్టేసిసింది. కళ్లముందే ఇళ్లు, వాహనాలు కొట్టు-కుపోయాయి. ప్రాణాలు రక్షించుకునేందుకు పరుగెత్తుతున్న వారిని వరద రాకాసిలా ముంచెత్తింది. దీంతో పదుల సంఖ్యలో జనాలు బురదలో కూరుకుపోయారు. ఇండ్లు, హోటళ్లను బురద ముంచెత్తింది. దాదాపు 25 హోటళ్లు కొట్టుకుపోయాయి. వరద కారణంగా ఇప్పటివరకు ఐదుగురు మరణించినట్లు- అధికారులు గుర్తించారు. ఈ ఘటనలో కేరళకు చెందిన 28 మంది పర్యాటకుల బృందం గల్లంతు అయినట్లు- తెలుస్తోంది. ఉత్తరకాశి నుండి గంగోత్రికి బయలుదేరుతున్న సమయంలో వారు చివరిసారిగా తమతో మాట్లాడారని.. ఇప్పుడు వారి ఫోన్లు పనిచేయడం లేదని పర్యాటకుల బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సంఘటనాస్థలంలో ప్రస్తుతం భారత సైన్యం, సహాయక బృందాల నేతృత్వంలో సహాయక చర్యలు ముమ్మరంగా జరుగుతున్నాయి. భారీ వరదలతో కొట్టు-కుపోయిన రోడ్లు, కూలిపోయిన వంతెనల కారణంగా సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. ధరాలి నుండి ఇప్పటివరకు 130 మందికి పైగా ప్రజలను రక్షించారు. అయితే, కేరళ పర్యాటక బృందం ఆచూకీ ఇంకా తెలియలేదు.

## బీసీలపై కాంగ్రెది దొంగ ప్రేమ



50ఏళ్ల పాలనలో బీసీలకు ఎనలేని నష్టం : బండిసంజయ్

హైదరాబాద్:50 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో ఏనాడైనా బీసీలను పట్టించుకున్న దాఖలాలు ఉన్నాయా?.. సీఎంను చేసిన లెక్కలు ఉన్నాయా ఉంటే చెప్పాలని కేంద్ర మంత్రి బండిసంజయ్ ప్రశ్నించారు. ముస్లిం రిజర్వేషన్ల కోసమే కాంగ్రెస్ ధర్నా చేస్తోందని ఆరోపణలు చేశారు. ఇది కామారెడ్డి డిక్లరేషన్ కానే కాదని.. ముమ్మాటికీ ముస్లిం డిక్లరేషనేనని విమర్శలు చేశారు. బీసీలకు 5శాతం పెంచి.. ముస్లింలకు అదనంగా పదిశాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కుట్ర చేస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఢిల్లీ వేదికగా బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. బీసీ ముసుగులో ముస్లింలకు వంద శాతం రిజర్వేషన్లను అమలు చేసే కుట్ర జరుగుతోందని ఆక్షేపించారు. కాంగ్రెస్ ధర్నాకు బీసీల మద్దతు కరువైందని విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తేనే మద్దతిస్తామని క్లారిటీ ఇచ్చారు. బీసీలకు ఏ పార్టీ ఏం చేసిందో బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు బండి సంజయ్. 50 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఎన్నడైనా బీసీని ప్రధాని చేశారా? అని బండి సంజయ్ ప్రశ్నించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 48 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఒక్క బీసీనైనా సీఎం చేశారా? అని నిలదీశారు. తెలంగాణ కేబినెట్, నామినేటెడ్ పదవుల్లో ఎంతమంది బీసీలకు ఇచ్చారో చర్చిద్దామా? అని సవాల్ విసిరారు. లోక్‌సభ సభ్యుల్లో ఎంతమంది బీసీలకు సీట్లిచ్చారో సమాధానమివ్వగలరా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్ పార్టీనా బీసీల గురించి తమకు నీతులు చెప్పేది? అని నిలదీశారు. బీసీని ప్రధాని చేసిన ఘనత బీజేపీదేనని ఉద్ఘాటించారు బండి సంజయ్. 27మంది బీసీ కేంద్రమంత్రులను, అనేక రాష్ట్రాలకు బీసీ సీఎంలను నియమించిన ఘనత బీజేపీదేనని బండి సంజయ్ కేంద్రంపై నెపం మోసిందని చెప్పారు. బీసీ రిజర్వేషన్ల నుంచి కాంగ్రెస్ నేతలు తప్పుకోవాలనుకుంటున్నారని ధ్వజమెత్తారు. యూపీ, బెంగాల్, బిహార్ తరహాలో తెలంగాణలోనూ కాంగ్రెస్ కనుమరుగవడం తథ్యమని బండి సంజయ్ హెచ్చరించారు. ఈరోజు న్యూఢిల్లీలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ముస్లింలకు వంద శాతం రిజర్వేషన్లు కల్పించేందుకే జంతర్ మంతర్ వద్ద ధర్నా చేస్తోందే తప్పా బీసీల కోసం కానేకాదని స్పష్టం చేశారు. కామారెడ్డి డిక్లరేషన్‌పై కాంగ్రెస్ మాట తప్పిందని విమర్శించారు. మైనార్టీ ఓట్ల కోసం ముస్లిం డిక్లరేషన్‌ను అమలు చేయాలనుకుంటోందని విమర్శించారు. బీసీలను ఘోరంగా మోసం చేస్తోంది. అందుకే కాంగ్రెస్ ధర్నాకు బీసీల మద్దతు కరువైందని బండి సంజయ్ ఆక్షేపించారు.

# ఎస్పీడబ్ల్యూ మహిళా జూనియర్ కళాశాలను పరిశీలించిన టిటిడి ఛైర్మెన్

విద్యార్థినుల హాస్టల్ సౌకర్యాల పెంపుకు ఆదేశం

**తిరుపతి,ఉత్తేజిత ప్రతినిధి, ఆగస్టు 06.**



ఎస్పీడబ్ల్యూ మహిళా జూనియర్ కళాశాలలో అత్యవసరమైన పనులను సకాలంలో పూర్తి చేయాలని టిటిడి ఛైర్మెన్ శ్రీ బీఆర్ నాయుడు ఆదేశించారు. మహిళా జూనియర్ కళాశాల జేఈవో శ్రీ వి. వీరబ్రహ్మం, టిటిడి బోర్డు మెంబర్ శ్రీ జి. భానుప్రకాష్ రెడ్డి కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా టిటిడి ఛైర్మెన్ మాట్లాడుతూ, మహిళా జూనియర్ కళాశాలలో విద్యార్థినుల సమస్యలు తన దృష్టికి వచ్చాయని, విద్యార్థినులు ప్రాథమిక అవసరాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కళాశాలలోని సమస్యలను టిటిడి జేఈవో, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తన దృష్టికి తీసుకువచ్చారని, వాటి అన్నింటిపై నివేదిక తయారు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. విద్యార్థినులు చదువుకునేందుకు కళాశాల పరిసరాలు చాలా బాగున్నాయన్నారు. అదేవిధంగా ఈ కళాశాలలో ఉత్తీర్ణత శాతం చాలా అద్భుతంగా ఉందని అభినందించారు. ముఖ్యంగా కళాశాలలో విద్యార్థినులకు హాస్టల్ సామర్థ్యాన్ని, వసతి సౌకర్యాన్ని పెంచాలని, వైద్య సౌకర్యాల పెంపు, వేడి నీటి కోసం సోలార్ వాటర్ హీటర్స్, ఈ - లెర్నింగ్ సెమినార్ హాల్ ఏర్పాటు, హాస్టల్ లో మరమ్మతులు, ఫిజికల్ ఎడ్యూకేషన్ సౌకర్యం తదితర అంశాలపై అధికారులు నివేదిక తయారు చేసి కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులకు టిటిడి ఛైర్మెన్ సూచించారు. అంతకుముందు టిటిడి ఛైర్మెన్ శ్రీ బీఆర్ నాయుడు అధికారులతో కలిసి కాలేజీ పరిసరాలను, వంట గది, హాస్టల్ ప్రాంతాలను తనిఖీ చేశారు. అటు తరువాత విద్యార్థినులు, తల్లిదండ్రులతో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టిటిడి డిఈవో శ్రీ వెంకట సునీల్, ప్రిన్సిపాల్ డా. సి. భువనేశ్వరి, ఎస్.ఈ శ్రీ మనోహరం తదితరం అధికారులు పాల్గొన్నారు.

# శ్రీవారి ఆలయంలో శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ

**తిరుమల ,ఉత్తేజిత ప్రతినిధి, ఆగస్టు 06**



తిరుమల శ్రీవారి ఆలయ పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజు బుధవారం శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ జరిగింది. ఈ సందర్భంగా ఉదయం యాగశాలలో హోమాలు తదితర వైదిక కార్యక్రమాలు చేపట్టారు. ఆ తరువాత సంపంగి ప్రాకారంలో వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు తదితర సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. అనంతరం వేద ఘోష, మంగళవాయిద్యాల నడుమ శ్రీవారి మూలవర్లకు, ఉత్సవ మూర్తులకు, జయవిజయులకు, గరుడాళ్వారుకు, వరదరాజస్వామివారికి, వకుళమాత అమ్మవారికి, ఆనంద నిలయం, యాగశాల, విష్వక్సేనులవారికి, యోగ నరసింహస్వామి వారికి, భాష్యకార్లకు, పోటు తాయారుకు, ధ్వజస్తంభం, బలిపీఠం, శ్రీభూవరాహస్వామివారికి, శ్రీ బేడి ఆంజనేయస్వామివారికి పవిత్రమాలలు సమర్పించారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిస్తారు. రాత్రి 8 నుంచి 11 గంటల వరకు యాగశాలలో వైదిక కార్యక్రమాలు జరుగను న్నాయి. పవిత్రోత్సవాలు తిరుమలలో 15-16 శతాబ్దాల వరకు జరిగినట్టు ఆధారాలున్నాయి. 1962వ సంవత్సరం నుంచి దేవస్థానం ఈ ఉత్సవాలను పునరుద్ధరించింది. చారిత్రక ఆధారాల ప్రకారం శ్రీస్వామివారి ఉత్సవమూర్తులకు కావలసిన పవిత్రాలు చేయడానికిగాను శ్రేష్టమైన జాతి పత్తి మొక్కలను అత్యంత పవిత్రమైన దైవమొక్కగా భావించే తులసి పెంచడానికి ఉపయోగించే పెరటి భూమిలో పెంచడం విశేషం. పవిత్రాలను తయారు చేయడానికి 20 మూరల పట్టుదారం గానీ లేదా 200 మూరల నూలుదారం

గానీ ఉపయోగిస్తారు. ఈ దారాలకు తెలుపుతో పాటు నలుపు, ఎరుపు, ఆకుపచ్చ, పసుపుపచ్చ రంగులు అద్దకం చేస్తారు. ఈ కార్యక్రమంలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి, ఈవో శ్రీ జె.శ్యామలరావు, అదనపు ఈవో శ్రీ సిహెచ్ వెంకయ్య చౌదరి, ఆలయ ప్రధాన అర్చకులు, డెప్యూటీ ఈవో శ్రీ లోకనాథం ఇతర అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

# విద్యుత్ స్మార్ట్ మీటర్లను పెట్టవద్దు: సిఐటియు డివిజన్ కార్యదర్శి మోహన్

**సి.బెళగల్ ఉత్తేజిత న్యూస్ జులై 6**




ప్రజల నుంచి కార్పొరేట్లకు దోచిపెట్టె విద్యుత్ స్మార్ట్ మీటర్లు ప్రజల ఇళ్లకు బిగించరాదని, సెఖి ఒప్పందం రద్దు చేయాలని, పాత విద్యుత్ మీటర్లనే కొనసాగించాలని, కార్మిక, ప్రజా సంఘాల ఐక్యవేదిక డివిజన్ నాయకులు జె.మోహన్ మంగళవారం సి.బెళగల్ మండలంలోని విద్యుత్ కార్యాలయం ముందు హమాలీ సంఘం నాయకులతో కలిసి ధర్నా నిర్వహించి, విద్యుత్ అధికారులకు వినతి పత్రం అందజేశారు. యువగలం పాదయాత్రలో ప్రస్తుత విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ రైతులకు, ప్రజల ఇళ్లకు విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగిస్తే, విద్యుత్ మీటర్లను పగలగొట్టండని, స్మార్ట్ మీటర్ల ద్వారా విద్యుత్ చార్జీలు,పెరిగి ప్రజలు నష్టపోతారని ప్రచారం చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ప్రజలను, చిన్నచిన్న వ్యాపార సంస్థలను భయపెట్టి దొంగ చాటున స్మార్ట్ మీటర్లను బిగించారని, ప్రస్తుతం నివాస ప్రాంతాలకు కూడా విద్యుత్ మీటర్లను బిగించే ప్రయత్నంలో ఉన్నారని తెలిపారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రజల అనుమతి లేనిదే స్మార్ట్ మీటర్లు బిగించమని చెబుతూనే ,మరో పక్కన స్మార్ట్ మీటర్లు ఎన్ని బిగించారు రిపోర్టు ఇవ్వాలని అధికారులను ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. విద్యుత్తు ప్రైవేటుపరం చేయడానికి స్మార్ట్ మీటర్ల విధానం తీసుకొచ్చారని, స్మార్ట్ మీటర్లను ప్రీపెయిడ్ మీటర్లుగా మార్చి సెల్ ఫోన్లు ఏ విధంగా అయితే రీచార్జ్ చేసుకొని ఉపయోగించుకుంటామో,భవిష్యత్తులో స్మార్ట్ మీటర్ల కూడా ముందుగానే డబ్బులు పెట్టి రీచార్జ్ చేసుకొని కరెంటు వాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. గత వయసు ప్రభుత్వం ఆదాని గ్రూపుతో 1750 కోట్లు లంచం తీసుకొని స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని చేసుకున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వం ఆదానితో చేసుకున్న సెఖి ఒప్పందాన్ని రద్దుచేసి, పాత కరెంట్ మీటర్లని కొనసాగించాలని విద్యుత్ శాఖ లైన్ ఇన్స్పెక్టర్ ఆలాం, లైన్మెన్ శ్రీనివాసులకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు, ఏఐటీయూసీ, హమాలి కార్మికులు జైలు, నాగన్న, భాస్కర్, మాబు, రవి, శాంతన్న, హుస్సేనప్ప ,బాలు, పెద్ద హుస్సేన్, గోపాల్, ఎంకప్ప తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మిగనూరు పట్టణం 1వ వార్డులో "బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ"

**ప్రచారం విజయవంతంశ్రీమతి బుట్టా రేణుక గారి ఆదేశాల మేరకు 1వ7 వార్డులో ఇంటింటి ప్రచారం కార్యక్రమం 1వ కౌన్సిలర్,పట్టణ అధ్యక్షులు కామర్తి నాగేశప్ప నిర్వహించడం జరిగింది.**

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**

ఎమ్మిగనూరు, ఆగస్ట్ 6: ఎమ్మిగనూరు నియోజకవర్గ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, మాజీ పార్లమెంట్ సభ్యురాలు శ్రీమతి బుట్టా రేణుక గారి ఆదేశాల మేరకు, రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న "బాబు ష్యూరిటీ %-% మోసం గ్యారంటీ" ప్రచార కార్యక్రమం, ఎమ్మిగనూరు పట్టణంలోని 1వ వార్డులో అట్టహాసంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షులు, 1వ వార్డు కౌన్సిలర్ శ్రీ కామర్తి నాగేశప్ప స్వయంగా పర్యవేక్షించారు. ఆయన నాయకత్వంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలతో ప్రత్యక్షంగా ముఖాముఖీ కలుసుకొని చైతన్యాన్ని కలిగించారు. ప్రచారంలో భాగంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తీసుకున్న ప్రజావ్యతిరేక నిర్ణయాలను వివరించారు. ముఖ్యంగా, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను మరిచిన తీరును, సంక్షేమ పథకాలపై తీసుకున్న నిర్లక్ష్య వైఖరిని ప్రజలకు వివరించారు. పింఛన్ల కోత, అమ్మఒడి, వసతి దీవెన, విద్యా పథకాలపై నిఘా, గృహహక్కుల తొలగింపుపై ప్రజల్లో మౌలిక అవగాహన కలిగించడానికి ప్రచారం సాగిందిఈ సందర్భంగా కామర్తి నాగేశప్ప మాజీ "ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారి హయాంలో సంక్షేమానికి గ్యారంటీ ఉండేది. కానీ ఇప్పుడున్న కూటమి ప్రభుత్వం పాలనలో ప్రజలకు దక్కేదేం లేదు. హామీలన్నీ మోసంగా మారాయి. అందుకే ప్రజల్లో మళ్లీ స్పష్టత రాబట్టే నమ్మకపూరిత కార్యక్రమంగా ఈ ప్రచారం జరుగుతోంది" అని తెలిపారు."బాబు ష్యూరిటీ అంటే మోసం గ్యారంటీ... జగన్ గ్యారంటీ అంటే సంక్షేమ హామీ" అనే నినాదాలతో ప్రచారం సాగింది. ప్రజల నుండి మంచి స్పందన లభించడంతో కార్యకర్తలు మరింత ఉత్సాహంగా ప్రచారాన్ని విస్తరించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు చెడ్డి గోపాల్, మీ వెంకటేష్, పట్టణ బీసీ విభాగ ఉపాధ్యక్షులు కనికే నాగరాజు, వాణిజ్య విభాగ కార్యదర్శి నాగల్లి రామలింగప్ప, ఐటీ విభాగ కార్యదర్శి బండ రాజశేఖర్, పట్టణ వాలంటీర్ విభాగ అధ్యక్షులు వీరేశ్, టౌన్ కార్యవర్గ సభ్యుడు కోట గణేష్ గార్లు పాల్గొన్నారు.



# ఖాళీ స్థలాల్లో భవన నిర్మాణ వ్యర్థాలు లేకుండా చూడండి.

**తిరుపతి,ఉత్తేజిత ప్రతినిధి ఆగస్టు 06.**

నగరంలోని ఖాళీ స్థలాల్లో భవన నిర్మాణ వ్యర్థాలు, పిచ్చి మొక్కలు లేకుండా శుభ్రంగా ఉంచాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. బుధవారం నగరంలోని అన్నారావు కూడలి, కె.టి.రోడ్డు, తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులతో పాటు, ప్రజల నుండి వచ్చిన వినతులను హెల్త్, ఇంజినీరింగ్ అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. పలు చోట్ల భవనాల వ్యర్థాలు ఉండడం, మురుగునీటి కాలువల్లో చెత్త ఉండడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. నగరంలో ఎక్కడైనా భవన నిర్మాణ వ్యర్థాలు ఉంటే వెంటనే వాటిని తూకివాకం ప్లాంట్ కు తరలించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ప్రజల నుండి వచ్చిన వినతులను అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అన్నారు. అనుసంధాన మార్గాల్లోని రోడ్లలో కూడా గుంతలను పూడ్చాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. చెత్త కుప్పలు ఎప్పటికప్పుడు తొలగించాలని అన్నారు. ఎవరైనా రోడ్లపై వేస్తే జరిమానాలు విధించాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, డి.ఈ.లు మధు, వెంకట ప్రసాద్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్ రవి, సూపర్ వైజర్ చెంచయ్య, తదితరులు ఉన్నారు.

# చేనేత రంగ పునరుజ్జీవానికి YHL APP ఓ నూతన అధ్యాయం

బుట్టా దంపతుల ప్రయత్నాలను ప్రశంసించిన వైయస్ జగన్ మోహన్ రెడ్డి

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**



ఎమ్మిగనూరు, ఆగస్ట్ 06:ఎమ్మిగనూరు ఆగస్టు 6 బుధవారం నియోజకవర్గంలో చేనేత రంగాన్ని మరింత వ ్ర ో గ తి వ ధ ం లో కి నడిపించేందుకు తీసుకుంటున్న వినూత్న చర్యలకు పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్ మోహన్ రెడ్డి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. 06.08.2025 తేదీన డోన్ పట్టణంలో మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ కుమారుని వివాహ కార్యక్రమానికి హాజరైన సందర్భంలో, ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ పార్లమెంట్ సభ్యురాలు శ్రీమతి బుట్టా రేణుక గారు, బుట్టా ఫౌండేషన్ అధినేత శ్రీ బుట్టా శివనీలకంఠ గారితో కలిసి, ఇటీవల తయారు చేసిన %నూ ాూర్రూ% (ఎమ్మిగనూరు హెరిటేజ్ లూమ్స్) గురించి సమగ్ర వివరాలు ఆయనకు తెలియజేశారు. ఈ యాప్ ద్వారా ఎమ్మిగనూరు ప్రాంత చేనేత కార్మికులకు నూతన మార్కెట్ అవకాశాలు, ఆధునిక డిజిటల్ వేదికలు అందుతాయనీ, వారి శ్రమకు వ్యాపార గౌరవం కలుగుతుందనీ బుట్టా దంపతులు తెలిపారు. స్థానికంగా చేనేత ఉత్పత్తులను ప్రపంచ మార్కెట్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో రూపొందించిన ఈ యాప్ చేనేత కుటుంబాల ఆర్థిక స్థితిని మెరుగుపరచే దిశగా కీలక మలుపుగా నిలవనుంది. ఈ ప్రణాళికకు అనుకూలంగా స్పందించిన వైయస్ జగన్ మోహన్ రెడ్డి గారు, "సాంప్రదాయ కళల పరిరక్షణకు, గ్రామీణ ఉపాధికి, మహిళా శక్తికి బలాన్నిచ్చే మీ ఈ సృజనాత్మక ప్రయత్నం అభినందనీయం," అని ప్రశంసించారు. ఇలాంటి కార్యక్రమాలే సంస్కృతిని నిలబెట్టేందుకు, ప్రజల జీవితాల్లో మార్పును తీసుకురావడంలో కీలకమైనవని పేర్కొన్నారు.

# నవధాన్యాల సాగుతో అధిక లాభం: ఏ.ఓ మల్లేష్




**సి.బెళగల్ ఉత్తేజిత న్యూస్ఆగస్టు 6**

సి.బెళగల్ మండల పరిధిలోని కొత్తకోట రైతు సేవ కేంద్రం నందు మండల వ్యవసాధికారి మల్లేష్ కుమార్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మల్లేష్ కుమార్ మాట్లాడుతూ రైతు సోదరులు తప్పకుండా ఖరీఫ్లో సాగు చేసినటువంటి పంటలను ఈ పంట నమోదు చేసుకోవాల్సిందిగా రైతులకు తెలియజేశారు అదేవిధంగా అన్ని రైతు సేవ కేంద్రాల యందు ఎరువులు మరియు యూరియా అందుబాటులో ఉందని రైతులకు తెలియజేశారు ముఖ్యంగా క్రాప్ ఇన్సూరెన్స్ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం ఈనెల చివరి వరకు ఉందని తెలిపారు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల గురించి అవగాహన కల్పించారు.నవధాన్యాల సాగు గురించి మాట్లాడుతూ,నవధాన్యాల సాగు చేయడం వలన కలిగే ప్రయోజనాల గురించి చెప్పారు. అలాగే పెరటి తోటల పెంపకం గురించి చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో రవిసాగర్, ప్రవీణ్,వెంకటేష్ నాయకులు హరి, చిన్న నాగన్న, గంగన్న ,శీను తదితరులు పాల్గొన్నారు.

# మద్యంతోనే పథకాలు గట్టెక్కాలి

అమరావతి: సూపర్ సిక్స్ అమలు కావాలంటే మద్యం బాగా అమ్మాలి. మద్యంతో ఆదాయం పెరగాలి. ఆదాయ వనరులు పెంచుకోవాలి. జగన్ ఏకంగా నకిలీ మద్యంతో ఆదాయాన్ని పెంచుకున్నారు. ఈ క్రమంలో ఇప్పుడు ఎపి ప్రభుత్వం కొత్త మద్యం పాలసీకి పచ్చజెండా ఊపింది. జగన్ హయాంలో బార్లలో ధరలను బార్లా తెరిచేశారు. అప్పటి ప్రభుత్వం ఇష్టానుసారం ధరలు పెంచుకోవచ్చని జీవో ఇవ్వడంతో అడ్డూ అదుపూ లేకుండా మందుబాబుల జేబులను గుల్ల చేశారు. వైసీపీ ప్రభుత్వం ఒకవైపు మ ద్యం ధరలను నూరుశాతం పెంచగా, బార్లలో దానిపై మరింత అదనంగా లాగేశారు. క్వార్ట రుకు రూ.50-రూ.70, బీర్కి ఏకంగా రూ.100- రూ.120 తీసుకుంటూ దోపిడీ చేశారు. ఐదేళ్లూ ఈ దందా సాగింది.ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఆ దోపిడీకి కొత్త మద్యం పాలసీతో అడ్డుకట్ట వేసింది. బార్లలో కూడా దుకాణాల్లో ధరలనే అమలుచేయాలని నిర్ణయానికి వచ్చింది. దుకా ణాల కంటే 10 శాతం ఎక్కువ ధర చెల్లించి బా ర్లు ప్రభుత్వ మద్యం డిపోల నుంచి కొనుగోలు చేస్తాయి. బార్లలో కూడా దుకాణాల ధరే నిర్ధా రిస్తే ఆ శాతాన్ని ప్రభుత్వం నష్టపోవాల్సి ఉంటుంది. దరఖాస్తు రుసుం రూ.5 లక్షలు ఉంటుందని చెబుతున్నారు. మద్యం బార్ల ఎంపికకు రాష్ట్ర ప్రభుత్వం నూతన పాలసీకి రూపకల్పన చేసింది. గత వైసీపీ ప్రభుత్వంలో 2022-25 మధ్య అమలైన మద్యం బార్ల పాలసీ గడువు ఆగస్టు 31వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో సెప్టెంబరు 1వ తేదీ నుంచి రాష్ట్రంలో కొత్త మద్యం బార్ల పాలసీ అమలుకు గ్రీన్సిగ్నల్ పడింది. ముందస్తుగా ఈ పాలసీ అమలుకు రాష్ట్రంలో మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించి ఆ ఉపసంఘం ఇచ్చిన అధ్యయన నివేదిక ఆధారంగా కొత్త బార్ల పాలసీ అమలుకు శ్రీకారం చుట్టనుంది.

ఉత్తేజిత దినపత్రిక

# విపక్షాల సమర్థతకు విషమ పరీక్ష !

పార్లమెంట్ మలివిడత బడ్జెట్ సమావేశాలు సోమవారం ప్రారంభం అయ్యాయి. దేశంలో ఉన్న సమస్సయల దృష్ట్యా ఈ సమావేశాలే కీలకం. ఈ సమావేశాల్లో ఏ అంశంపై చర్చించాలి..చర్చించకూడదు.. సభాసమయాన్ని సద్వినియోగం చేసుకోవడమెలా అన్నది కూడా విపక్ష కాంగ్రెస్ చతురతపై ఆధారపడి ఉంది. అలాగే విపక్షాలు కూడా సమర్థత ప్రదర్శించాల్సి ఉంది. కేవలం అల్లరి చేసి వాకట్లు చేయడమో. ప్రతిష్టంభనతో సభ వాయిదా వేయించడం వల్లనో సమస్యలు చర్చకు రావు. ఇది గమనించి కాంగ్రెస్ వ్యూహాత్మకంగా వ్యవహరించాల్సి ఉంది. లేకుంటే అది విపక్ష పార్టీగా విఫలం అయినట్లే. ప్రధానంగా డిటిమిటేషన్ భయాలు, జనగణన,జివిఎస్టీ, నిరుద్యోగం, ఔషధధరలు, పెరుగుతున్న నిత్యావసర ధరలు వంటి ప్రధాన సమస్యలు దేశాన్ని పట్టిపీడిస్తున్నాయి. ప్రధానంగా ఇప్పుడు డీలిమిటేషన్‌పై సర్వత్రా చర్చ నడుస్తోంది. దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా ప్రాతిపదికన సీట్లు తగ్గుతాయని ఆందోళన వ్యక్తం అవుతోంది. దీనిపై బిజెపి లేదా ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదు. తెలంగాణ బిజెపి నేతలు మాత్రం సీట్లు తగ్గవని అంటున్నారు. ఇంతకీ ఇప్పుడున్న సీట్లు తగ్గవా లేక, పెరిగే సీట్లు తగ్గవా అన్నది స్పష్టం చేయకుండా గోడవాటం పిల్లిలా వ్యవహరిస్తున్నారు. అమెరికా తరహాలోనే భారత్ కూడా ప్రజ్యాస్వామ్య వ్యవస్థ కలిగిన సమాఖ్య రాజ్యం. 1971లోని జనాభా నిష్పత్తి ప్రకారం ప్రాతినిధ్యం కల్పించడం వల్ల ఊహించని ప్రమాదాలు ఎదురవుతాయనే వాస్తవాన్ని గుర్తించాము. అయితే ఒక పరిష్కారాన్ని కనుగొనడానికి బదులు దాన్ని 2026 దాకా వాయిదా వేశాము. చివరి జనాభా గణన 2011లో జరిగింది. తదుపరి జనాభా గణన 2021లో జరగవలసి ఉండగా కోవిడ్ విలయం వల్ల వాయిదా వేశారు. 2021 నుంచి ఏదో ఒక సాకుతో జనాభా గణన జరగనే లేదు. తాజాగా కులగణన అంటూ కాంగ్రెస్ రాజకీయాలు మొదలు పెట్టింది. దీంతో సమాజంలో చీలిక తప్ప మరోటి రాదు. ఇది ఓ రకంగా అచ్చం రాజకీయ లబ్ధికోసం చేస్తున్న డిమాండ్ తప్ప మరోటి కాదు. ఈ క్రమంలో 2026లో జనాభా గణన అనంతరం విధిగా లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన జరగవలసి ఉన్నది. ప్రతి రాష్ట్రానికి కేటాయించే సీట్ల సంఖ్యను కూడా అప్పుడే నిర్ణయిస్తారు. జనాభా పెరుగుదల అదుపులేకుండా జరిగినందుకు కొన్ని రాష్ట్రాలకు ప్రయోజనాలు కల్పిస్తారు. సంపూర్ణ ప్రజనన రేటు 2 శాతం, అంతకంటే తక్కువగా ఉండాలన్న నిర్దేశిత లక్ష్యాన్ని సాధించిన రాష్ట్రాలను సీట్ల కుదింపుతో శిక్షించనున్నారన్న ప్రచారం సాగుతోంది. ఇలా కేవలం జనాభా ప్తరాపిదకిగా కాకుండా మధ్యేమార్గం అవలంబించాల్సిన అసవరం ఇప్పుడు కనిపిస్తోంది. పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయని తమిళనాడు సిఎం స్టాలిన్ పోరుబాట పట్టారు. జనాభా నిష్పత్తి సూత్రానికి అనుగుణంగా ఆయా రాష్ట్రాల సీట్ల సంఖ్యను పునర్ నిర్ధారించడం ద్వారా దక్షిణ్యాది రాష్ట్రాలకు నషటం జరగడం ఖాయంగా కనిపిస్తోంది. దక్షిణాది రాష్ట్రాల్లో ఇప్పుడు లోక్‌సభలో 129 స్థానాలున్నా వారి గళం పెద్దగా విన్పించడం లేదు. ఇప్పుడా సీట్ల సంఖ్య మరింతగా తగ్గితే దక్షిణాది ప్రతినిధుల మాటను కేంద్రం పట్టించుకోదు. సీట్ల సంఖ్య తగ్గించబోమనే హామీలో నిజాయితీ కొరవడింది. ఇదే సందర్భంలో జనాభా అత్యధికంగా ఉన్న యూపీ, బిహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌ల సీట్ల సంఖ్యను పెంచబోమని కేంద్రం స్పష్టంగా ప్రకటించడం లేదు. సీట్ల సంఖ్య పునర్ నిర్ధారణకు జనాభా నిష్పత్తి సూత్రాన్ని అనుసరించిన పక్షంలో దక్షిణాది రాష్ట్రాల బలం మరింతగా తగ్గిపోతుంది. పర్యవసానంగా పార్లమెంటులో దక్షిణాది వారి గళం వినిపించే వారి సంఖ్యా తగ్గుతుంది. ఈ రాష్ట్రాల సమస్యల పరిష్కారం పట్ల నిర్లక్ష్యం పెరుగుతంది. కొన్ని రాష్ట్రాలకు సీట్ల సంఖ్యను కుదించాలన్నా, పెంచాలన్నా ఇప్పుడున్న సీట్ల సంఖ్యను అనివార్యంగా పెంచాలి.

రాష్ట్రాల సైజు బట్టి సీట్లను పెంచడం కూడా ఆలోచించాలి. లోక్‌సభకు ఎన్నికయ్యే ప్రతినిధుల సంఖ్యను విధిగా పెంచవలసి ఉంటుంది. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన, 1977లో రాజ్యాంగానికి 42వ సవరణ జరిగింది. లోక్‌సభలో ప్రస్తుతం రాష్ట్రాల నుంచి ఎన్నికైన ప్రతినిధులు 530 మంది, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 13 మంది ఉన్నారు. అధికరణ 81లోని నిబంధన 2(ఎ) ప్రకారం ప్రతి రాష్ట్రం నుండి లోక్‌సభకు ఎంతమంది ఎన్నిక కావాలనే విషయం ఆ రాష్ట్ర జనాభాపై ఆధారపడి ఉంటుంది. జనాభాకు, లోక్‌సభ సభ్యుల సంఖ్యకు గల నిష్పత్తి సాధ్యమైనంతవరకు అన్ని రాష్ట్రాలకు ఒకే విధంగా ఉంటే పేచీ ఉండదు. ఇకపోతే ప్రధానంగా మరో రాజ్యాంగ సవరణ కూడా చేయాల్సి ఉంది. ఇప్పుడున్న ఎంపిలు, ఎమ్మెల్యేలు వరుసగా వారే ఎన్నికవుతూ వస్తున్నారు.. కలు,ధనబలం ద్వారా ఒక్కరే ఆరేడు పర్యాయాలు సభ్యులుగా ఉంటున్నారు. ఇది పోవాల్సిన అవసరం ఉంది. 140 కోట్లు ఉన్న దేశంలో కొందరే నిరంతరంగా చట్టసభలను గబ్బిలాల్లో పట్టుకుని వెళ్లాడుతున్నారు. ఇందులో అన్ని పార్టీల వారూ ఉన్నారు. ఇది పోతేనే దేశం బాగుపడదు. అలాగే ప్రజాస్వామ్యం బలపడదు. దీనిపై బిజెపి దృష్టి పెట్టాల్సి ఉంది. కనీసం రెండు టర్మ్‌లకు మించి ఎన్నిక కాకుండా రాజ్యాంగ సవరణ చేయాలి. మూడో దఫాలో అధికారం చేపట్టిన మోడీ అనేక ఆశలు కల్పించారు. ఇలాంటి సంస్కరణలు చేపడితే ప్రజలు ఆమోదిస్తారు. హర్షిస్తారు. రాజకీయ పార్టీల నేతలు జీవితాంతం చట్టసభల్లో తిష్టవేయకుండా చేస్తే..దేశ ప్రయోజనాలు కాపాడిన వారు అవుతారు.

# ఉపాధి రంగాలు బలోపేతం కావాలి



అమెరికాలో ఉన్నత చదువులు చదివిన భారతీయులు ఉద్యోగాలు లేక అక్కడ మగ్గుతున్నారు. మన దేశంలో ఉద్యోగాలు దక్కక ఎంతోమంది విదేశాలకు వెళ్లినా వారికి భరోసా దక్కడం లేదు. అటు ఉద్యోగాలు దొరక్క..బ్యాంకు రుణాలు కట్టలేక నానా అవస్థలు పడుతున్నారు. పోనీ దేశానికి వచ్చి ఇక్కడేమైనా చేద్దామా అంటే ఇక్కడా పరిస్థితి దారుణంగా ఉంది. దేశంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కనిపించడం లేదు. ఉన్న ఉద్యోగులను మెల్లగా తీసేస్తున్నారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం అనుసరి స్తున్న విధానాల ఫలితంగా నిరుద్యోగం పెరుగుతున్నది. అలాగే ప్రైవేట్ పెట్టుబడులు తగ్గుతున్నవి. ప్రభుత్వ ఉద్యోగాలకోసం యువత ఎదురుచూడటం ఈ మధ్యకాలంలో ఎక్కువవుతున్నది. ఇలాంటి తక్షణ, అత్యవసర సమస్యల పరిష్కారంపట్ల దృష్టిసారించాల్సిందిపోయి నిర్లిప్తంగా ఉంటున్నాయి. రాజకీయాలు నెరిపే పార్టీలు ప్రజా సంక్షేమం, అభివృద్ధి కేంద్రంగా వ్యవహరించాలి. ఈ క్రమంలో ముందు ఆర్థిక వ్యవస్థ బలపడాలి. తరవాత స్వయం ఉపాధి పథకాలు భారీగా చేపట్టాలి. కానీ కేంద్ర ప్రభుత్వం ఈ దిశంగా చర్యలు తీసుకోవడం లేదు. ఆర్థిక మందగమనంపై దిద్దుబాటు చర్యలు తీసుకోవడం లేదు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే కొనసాగుతున్నా ముందే చర్యలు తీసుకుని ఉంటే కొంతయినా పరిస్థితి మెరుగు పడేది. నిజానికి మనది మిశ్రమ ఆర్థిక వ్యవస్థ. గ్రామీణ ఆర్థికరంగం బలోపేతం కావాలి. కానీ అలా జరగడం లేదు. కులవృత్తులకు ప్రోత్సాహం లేదు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాలను బలోపేతం చేసే చర్యలు తీసుకోవడం లేదు. నిరుద్యోగులను గట్టెక్కించే చర్యలకు బదులు, పన్నుల వసూళ్లపైనే దృష్టి సారిస్తున్నారు. అలాగే జిఎస్టీ సవరణలకు పూనుకోవడం లేదు. దీంతో ఉద్యోగ,ఉపాధి రంగాలు తీవ్రంగా ప్రభావం చూపుతున్నాయి. గతంలోనే ఆర్‌బిఐ గవర్నర్‌గా ఉన్న రఘురామ్ రాజన్ అనేక హెచ్చరికలు చేసినా పట్టించుకోక పోవడం వల్ల ఈ దుస్థితి ఏర్పడిందనే చెప్పాలి. కారణాలను ఎవరో ఒకరిమీద నెట్టి తప్పించుకోవడం కన్నా దూరదృష్టితో సాగివుంటే ఇలాంటి దుస్థితి వచ్చేది కాదు. డాలర్‌తో మారక విలువను ఆధీనంలోకి తెచ్చుకోక పోతే మరిన్ని కష్టాలు తప్పవు. అలాగే ఎగుమతులకు ప్రాధాన్యం పెరగాలి. అనవసర దిగుమతులకు కళ్లెం వేయాలి. లేకుంటే విదేశీ మారక నిల్వలపై తీవ్రప్రభావం చూపనుంది. దీంతో రూపాయి మరింత బలహీన పడనుంది. ఈ దశలో ఆర్థిక మందగమనానికి చికిత్స వేసేందుకు ప్రభుత్వం గట్టిగానే ప్రయత్నాలు చేయాల్సి ఉంది. ఆర్థికవృద్ధికి ఊతమిచ్చేందుకు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పలు చర్యలను ప్రకటించినట్లు చెబుతున్నా..అవేవీ ఫలితం ఇవ్వడం లేదు. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే పారిశ్రామిక రంగానికి రుణాలు ఏ మాత్రం అందు బాటులోకి రాకపోవడంతో మార్కెట్‌లో మాంద్యం ఏర్పడిందని అప్పట్లో విమర్శలు వచ్చాయి. అది జిడిపి వృద్ధిరేటు దిగజారడానికి దారి తీసిందని విశ్లేషించారు. చిన్న మధ్యతరహా పరిశ్రమలకైతే రుణవితరణలో ప్రతికూల వృద్ధి నమోద యింది. దేశ చరిత్రలో పారిశ్రామిక రంగానికి వాణిజ్య రుణాలు భారీగా తగ్గడం కూడా ఇదే ప్రథమమని భావించారు. ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ పెట్టుబడి వ్యయాలను గణనీయం గా పెంచడం ద్వారా ఆ లోటును పూడ్చింది. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు పెరుగు తుండటం, అమెరికా-చైనా దేశాల మధ్య వాణిజ్య యుద్ధ భయాలు, యుద్దాలు కూడా మన ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కరెన్సీలు దారుణంగా పతనమవడం వంటి అంశాలు మన విదేశీ మారకపు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తున్నాయి. రూపాయి క్షీణత ఇలాగే కొనసాగితే దిగుమతులపై ఎక్కువగా ఆధారపడే మన దేశానికి ఆర్థిక ఇబ్బందులు తప్పేలా లేవు. వాణిజ్యలోటు, కరెంటు ఖాతా లోటు, ద్రవ్యోల్బణం పెరిగేందుకు రూపాయి పతనం పరోక్షంగా దోహదపడే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రూపాయి క్షీణతతో దిగుమతులు భారమవుతాయి. చమురు, పసిడి దిగుమతుల వ్యయాలు పెరిగితే, దేశ వాణిజ్య లోటు అధికమవుతుంది. దిగుమతుల కోసం విదేశీ మారకపు నిల్వలను అధికంగా ఖర్చు చేయాల్సి రావడంతో, కరెంటు ఖాతా లోటు కూడా పెరుగుతుంది. విదేశీ ప్రయాణాలు, చదువుల ఖర్చులు భారమవుతాయి. పెట్రోలు, డీజిల్ ధరలు పెంచాల్సిన పరిస్థితి నెలకొంటుంది. దీంతో రవాణా వ్యయాలు పెరిగి సరకులు ప్రియమవుతాయి. అప్పుడు ద్రవ్యోల్బణం కూడా పెరుగుతుంది. ఆర్‌బీఐ వడ్డీ రేట్లను పెంచాల్సిన పరిస్థితి వస్తుంది. దీంతో పారిశ్రామిక ప్రగతిపై నీలినీడలు కమ్ముకుం టాయి. పరోక్షంగా ఇది దేశ అభివృద్ధిని అడ్డుకుంటుంది. దీంతోపాటు డాలర్ బలపడుతున్నందున, విదేశీ మదుపర్లు దేశీయ మార్కెట్ల నుంచి పెట్టుబడులు ఉపసంహరిస్తే, ఈక్విటీ మార్కెట్లు నష్టపోతాయి. ఈ మధ్య బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తమ హయాంలో వృద్ధిరేటు ఎక్కువ ఉందంటే తమ హయాంలోనే అని వాదులా డుకున్నాయి. కానీ జరుగుతున్న అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం, ఫలాల పంపకం ఏ రీతిన ఉన్నదో చూడడం లేదు. అభివృద్ధి అన్నది ఉద్యోగ కల్పనకు గీటురాయిగా ఉండాలి. మొత్తానికి ఇప్పట్లో ఆర్థికరంగం

# ఆపరేషన్ మూసీ

**నిర్వాసితులకు పునరావాసం కల్పనకు ఉత్తర్వులు**

**15 వేల కుటుంబాలకు డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు**

**వివరాల సేకరణకు కలెక్టర్ల నేతృత్వంలో బృందాలు**

**రాజధాని హైదరాబాద్‌లో ఆపరేషన్ మూసీ మొదలైంది. ఈ నదీ పరీవాహకంలో ఆక్రమణల తొలగింపు తీరు మారుతోంది. ఒకట్రెండు రోజులు సమయమిచ్చి ఆక్రమణదారులను బలవంతంగా తరలించి, కూల్చివేతలను చేపట్టే ప్రక్రియకు రాష్ట ప్రభుత్వం ఫుల్‌స్టాప్ పెట్టబోతోంది.**



హైదరాబాద్:రాజధాని హైదరాబాద్‌లో ఆపరేషన్ మూసీ మొదలైంది. ఈ నదీ పరీవాహకంలో ఆక్రమణల తొలగింపు తీరు మారుతోంది. ఒకట్రెండు రోజులు సమయమిచ్చి ఆక్రమణదారులను బలవంతంగా తరలించి, కూల్చివేతలను చేపట్టే ప్రక్రియకు రాష్ట్ర ప్రభుత్వం ఫుల్‌స్టాప్ పెట్టబోతోంది. ఆక్రమణదారులను ఒప్పించి, వారి సమ్మతితోనే అక్కడి నుంచి తరలించాకే, ఆక్రమణలను తొలగించాలని నిర్ణయించింది. అందులో భాగంగా నదీగర్భంలో ఇళ్లను నిర్మించుకున్న ఆక్రమణదారుల దగ్గరకు రెవెన్యూ అధికారులు స్వయంగా వెళ్లబోతున్నారు. వారికి అక్కడికక్కడే రెండు పడక గదుల ఇంటి అనుమతిపత్రాలను అందజేయబోతున్నారు. ఆక్రమణదారుల ఇళ్లను ఖాళీ చేయడానికీ తోడ్పాటు ఇవ్వనున్నారు. వారి సామగ్రిని అధికారులే వాహనాల్లో వారికి కేటాయించిన ఇళ్ల వద్దకు తరలించనున్నారు. ఎవరికైనా ఇతరత్రా నష్టం జరిగినా అందుకనుగుణంగా చర్యలు తీసుకోవడానికీ సిద్ధమయ్యారు. మూసీలో చిన్నాపెద్దా కలిపి 15 వేల ఆక్రమణలు ఉన్నాయని అధికారులు గుర్తించారు. ఎవరూ కన్నీరు పెట్టుకోకుండా, ఆందోళనలు చేపట్టకుండా వీటి తొలగింపు ప్రక్రియను సజావుగా సాగేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు యంత్రాంగం కదిలింది. మూసీ సుందరీకరణ ప్రాజెక్టులో భాగంగా నిర్వాసితులయ్యే మొత్తం 15 వేల కుటుంబాలకు రెండు పడక గదుల ఇళ్లను ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. మూడు రోజుల వ్యవధిలో తొలగింపు ప్రక్రియ మొదలవబోతోందని పురపాలక, పట్టణాభివృద్ధిశాఖల ముఖ్య కార్యదర్శి, మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ దానకిశోర్ తెలిపారు. ఇప్పటికే చాలామంది ఆక్రమణదారులు రెండు పడక గదుల ఇంటిని తీసుకోవడానికి అంగీకరించారని ప్రకటించారు. ఆక్రమణల తొలగింపు ప్రక్రియను దశలవారీగా చేపడతారు. మొదటిదశలో నదీగర్భంలో ఉన్న 1,600 ఆక్రమణల తొలగింపు బాధ్యతను హైడ్రాకు అప్పగించబోతున్నారు. రెండోదశలో... ప్రైవేటు స్థలంలో ఇళ్లు నిర్మించుకున్న వారివి తొలగిస్తారు. వారికి నష్టపరిహారం కూడా ఇవ్వబోతున్నారు.

‘క్యూ ఫిల్’ యాప్‌లో లబ్ధిదారుల పేర్లు నదీగర్భంలోని ఇళ్లను తొలగించే ప్రక్రియపై బుధవారం మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ దానకిశోర్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు అనుదీప్ దురిశెట్టి, కె.శశాంకలతో వేర్వేరుగా సమీక్షించారు. ఈ మేరకు రాజేంద్రనగర్, గండిపేట, హిమాయత్‌నగర్ మండలాల్లో రెవెన్యూ, ఇరిగేషన్, హెచ్‌ఎండీఏ, పోలీసులు, సర్వే అధికారులు పర్యటించారు. రాజేంద్రనగర్‌లో 300, హిమాయత్‌నగర్‌లో 75, గండిపేటలో 32 నిర్మాణాలను పరిశీలించారు. వర్షాలొస్తే ప్రస్తుతం ఇళ్లల్లో ఉంటున్న వారికి ఇబ్బందులు ఉంటాయని, అందుకే రెండు పడక గదుల ఇళ్లు ఇస్తున్నామని అధికారులు వారికి నచ్చజెప్పారు. వారి ఇళ్ల నంబర్లు, విద్యుత్ బిల్లు, జలమండలి కనెక్షన్ల వివరాలతోపాటు ఇంటి యజమాని వయసు, ఆధార్ నంబర్లను ‘క్యూ ఫిల్’ యాప్‌లో నమోదు చేశారు. రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అత్తాపూర్‌లో పర్యటించారు. ఆమెతోపాటు మూసీ రివర్ డెవలప్‌మెంట్ అథారిటీ సంయుక్త ఎండీ గౌతమి, రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకట్‌రెడ్డి, డీసీపీ సీహెచ్ శ్రీనివాస్, డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి, రాజేంద్రనగర్ మున్సిపల్ కమిషనర్ రవికుమార్, నార్సింగి మున్సిపల్ అధికారులు, రాజేంద్రనగర్ తహసీల్దార్ రాములు వేర్వేరుగా ఆక్రమణల వివరాలను సేకరించారు. ఏళ్ల తరబడి ఉంటున్న ఇళ్లను వదిలేసి ఎక్కడో కొత్త ప్రాంతానికి వెళ్లేందుకు చాలామంది

ఇష్టపడకపోవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా వీరంతా తమ చుట్టుపక్కల ప్రాంతాల్లో

చిన్నాచితకా వ్యాపారాలు, ఉపాధి పొందుతుంటారు.

వీరిని ఎక్కడో దూరంగా ఉండే కొత్త ప్రాంతానికి తరలిస్తే మళ్లీ అక్కడ వ్యాపారం చేసుకోవడం, ఉపాధి వెతుక్కోవడం కష్టమని నిర్వాసితులు భావించడం సహజమని, అందుకే ఇళ్ల తొలగింపు సందర్భంగా నిరసనలు తప్పకపోవచ్చని అధికారులు భావిస్తున్నారు.

# మరో ఐదు ఐటీ కంపెనీలు.. భూములు కేటాయింపు..

**రూ.15,226 కోట్లతో ఈ డేటా సెంటర్ ఏర్పాటు చేయనుంది. ఈ నేపథ్యంలో పరదేశీపాలెంలో సిఫీ సంస్థకు ఎకరా 50 లక్షల రూపాయల చొప్పున 25 ఎకరాలు**

ఏపీ: పెట్టుబడులు పెట్టేందుకు మరో ఐదు ఐటీ కంపెనీలు ముందుకు వచ్చాయి. ఈ నేపథ్యంలో విశాఖపట్నంలో ప్రభుత్వం వీటికి భూములు కేటాయించింది. ఐదు కంపెనీలు కలిపి రూ.19 వేలకు పైచిలుకు పెట్టుబడులు పెట్టనున్నాయి. ఈ పెట్టుబడుల ద్వారా సుమారుగా 50 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కుతాయని అధికారులు చెప్తున్నారు. ఐదు ఐటీ సంస్థలు కూడా విశాఖ కేంద్రంగా పెట్టుబడులు పెడుతున్నాయి. మరోవైపు ఇప్పటికే టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి సంస్థలు విశాఖలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన సంగతి తెలిసిందే.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మరో ఐదు ఐటీ కంపెనీలు రానున్నాయి. ఇప్పటికే టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి ప్రతిష్టాత్మక సంస్థలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. ఏపీ ఆర్థిక రాజధాని విశాఖపట్నంలో టీసీఎస్, కాగ్నిజెంట్ క్యాంపస్‌లు ఏర్పాటు చేయనున్నాయి. తాజాగా మరో ఐదు ఐటీ కంపెనీలు ఏపీలో పెట్టుబడులు పెట్టనున్నాయి. ఈ ఐదు కంపెనీలు కూడా



విశాఖపట్నంలోనే పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపించగా.. తాజాగా వీటికి ఏపీ ప్రభుత్వం భూములు కేటాయించింది. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్స్ ప్రమోషన్స్ బోర్డులో తీసుకున్న నిర్ణయం మేరకు ఐదు ఐటీ కంపెనీలకు భూములు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖపట్నంలో ఈ ఐదు కంపెనీలు కలిపి రూ.19,223 కోట్లు పెట్టుబడులు పెట్టనుండగా.. సుమారుగా 50 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కలగనున్నట్లు అధికారులు చెప్తున్నారు.

సిఫీ ఇన్ఫినిటీ స్పేషెస్ లిమిటెడ్ అనే సంస్థ విశాఖపట్నంలో డేటా సెంటర్ ఏర్పాటు చేయనుంది. రూ.15,226 కోట్లతో ఈ డేటా సెంటర్ ఏర్పాటు చేయనుంది. ఈ నేపథ్యంలో పరదేశీపాలెంలో సిఫీ సంస్థకు ఎకరా 50 లక్షల రూపాయల చొప్పున 25 ఎకరాలు కేటాయించారు. అలాగే మధురవాడ ఐటీ సెజ్‌లో ఎకరా కోటి రూపాయల చొప్పున 3.6 ఎకరాలు కేటాయించారు. ఈ పెట్టుబడుల ద్వారా 600 మందికి ఉపాధి దక్కనుంది. ఇక సత్వ డెవలపర్స్ అనే సంస్థ విశాఖలో రూ.1500 కోట్లు పెట్టుబడులు పెట్టనుంది. ఈ నేపథ్యంలో మధురవాడలో ఎకరా కోటిన్నర చొప్పున 30 ఎకరాలు కేటాయించారు. సత్వ పెట్టుబడులతో సుమారుగా 25 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

ఇక ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ వేయి కోట్లు పెట్టుబడి పెట్టనుంది. ఈ నేపథ్యంలో విశాఖపట్నం ఐటీ సెజ్‌లో ఎకరా 99 పైసల చొప్పున 10.29 ఎకరాల భూమిని కేటాయించారు. ఈ పెట్టుబడులతో పదివేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. పేనమ్ పీపుల్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థకు మధురవాడలోని హిల్-2లో 45 సెంట్లు, రుషికొండ ఐటీ పార్క్‌లో 4 ఎకరాలు మొత్తంగా ఎకరా రూ.4.05 కోట్లతో 4.45 ఎకరాలు కేటాయించారు.

పేనమ్ పీపుల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.207.5 కోట్ల పెట్టుబడి పెడుతోంది. దీనిద్వారా 2,500 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. ఇక బీవీఎం ఎనర్జీ అండ్ రెసిడెన్సీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు ఎండాడ వద్ద ఎకరా రూ.1.5 కోట్ల ధరతో 10 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది. బీవీఎం ఎనర్జీ సంస్థ రూ.1,250 కోట్ల పెట్టుబడితో 15000 మందికి ఉపాధి అవకాశాలు కల్పించనుంది.



## ఉచిత బస్సు ప్రయాణం.. గుర్తించుకోవాల్సిన రూల్స్...

ఏపీ: ఏపీ ప్రభుత్వం మహిళలకు ఆగస్ట్ 15 స్వాతంత్ర్య దినోత్సవ కానుక అందించనుంది. ఆగస్ట్ 15 నుంచి ఏపీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమల్లోకి రానుంది. ఈ విషయాన్ని ప్రభుత్వం కూడా ఇప్పటికే ప్రకటించింది. అయితే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం పేరుకు సంబంధించి సోషల్ మీడియాలో వార్తలు, పోస్టులు వైరల్ అవుతున్న సంగతి తెలిసిందే. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకానికి 'స్త్రీశక్తి' అనే పేరు పెట్టినట్లు నెట్టింట ఓ టికెట్ చక్కర్లు కొడుతోంది. అయితే అది డమ్మీ టికెట్ అని, ఉచిత బస్సు పథకం పేరు ఇంకా ఖరారు కాలేదని అధికారులు చెప్తున్నారు. ఈ క్రమంలోనే సీఎం నారా చంద్రబాబు నాయుడు నోటి నుంచే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకానికి సంబంధించి పేరు బయటకు వచ్చింది.

ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు శనివారం ప్రకాశం జిల్లాలో పర్యటించారు. దర్శి మండలం తూర్పు వీరాయపాలెం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు చెక్కులు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం చంద్రబాబు.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం పేరును బయటపెట్టేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆగస్టు 15 నుంచి స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించనున్నట్లు ప్రకటించారు. స్త్రీశక్తి పథకం కింద మహిళలు రాష్ట్రంలో ఎక్కడికైనా బస్సులలో ఉచితంగా ప్రయాణించవచ్చన్న సీఎం.. ఈ పథకం అమలుతో రాష్ట్రంలోని రూ.2.62 కోట్ల మంది మహిళలు బస్సులలో ఉచితంగా ప్రయాణించే అవకాశం కలుగుతుందన్నారు.

మహిళా సాధికారతను ప్రోత్సహించడంతో పాటుగా మహిళలకు ఆర్థికంగా సహాయపడాలనే ఉద్దేశంతో ఈ ఉచిత బస్సు పథకం అమలు చేయనున్నారు. ఈ పథకం అమలుతో ఆగస్ట్ 15 నుంచి రాష్ట్రంలోని 74 శాతం బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం సౌకర్యం అందుబాటులోకి వస్తుంది. ప్రస్తుతం ఏపీఎస్ఆర్టీసీలో 11,449 బస్సులు ఉన్నాయి. వీటిలో పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేయనున్నారు. మొత్తం బస్సులలో వీటి వాటా 8,548 (74 శాతం) అని అధికారులు చెప్తున్నారు వీటితో పాటుగా విద్యార్థుల కోసం నడుపుతున్న బస్సులు, డిపోలలో స్పేర్ కింద ఉన్న బస్సులను కూడా ఉచిత బస్సు పథకం కోసం నడపనున్నారు. గుర్తింపు కార్డులు తప్పనిసరి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన గుర్తింపు కార్డులలో ఏదో ఒకటి తప్పనిసరి అని ఆర్టీసీ అధికారులు చెప్తున్నారు. దీని ప్రకారం ఓటర్ కార్డు, ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు వంటి వాటితో ఉచిత ప్రయాణ సౌకర్యం పొందవచ్చు. ఈ పథకం కింద రాష్ట్రంలో ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించే వీలుంది. ఇందులో భాగంగా మహిళలకు జీరో ఫేర్ టికెట్లు జారీ చేస్తారు. ఈ జీరో ఫేర్ టికెట్లలో ప్రయాణానికి సంబంధించిన వివరాలు, పథకం అమలుతో ఎంత డబ్బులు ఆదా అయ్యాయనే వివరాలు ఉంటాయి. వయసుతో సంబంధం లేకుండా మహిళలు అందరికీ ఉచిత బస్సు పథకం వర్తిస్తుంది.

## కొడుకుగా ఆ వెలితి.. తండ్రిగా తీర్చేసుకున్నాడు..



ఏపీ: మంత్రి నారా లోకేష్ తన భార్య బ్రాహ్మణితో కలిసి కొడుకు దేవాంష్ చదువుతున్న స్కూల్‌కు వెళ్లారు. అక్కడ పేరెంట్-టీచర్ మీటింగ్‌కు హాజరయ్యారు. తీరికలేని సమయంలో ఇలాంటి మీటింగ్‌లకు వెళ్లడం సంతోషంగా ఉందని లోకేష్ అన్నారు. దేవాన్ష్ గురించి ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. దేవాన్ష్ నవ్వుతూ ముచ్చట్లు చెప్తుంటే తండ్రిగా గర్వంగా ఉందన్నారు. కొడుకుని చూసి నారా లోకేష్ చాలా సంతోషించారు.

ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇలాంటి క్షణాలు ఎంతో ప్రత్యేకం అంటూ ఆసక్తికర ట్వీట్ చేశారు. తొలిసారి నారా లోకేష్ సతీమణి బ్రాహ్మణితో కలిసి తన కుమారుడు దేవాన్ష్ చదువుతున్న స్కూల్‌కు వెళ్లారు.. అక్కడ పేరెంట్-టీచర్ మీటింగ్ (పీటీఎం)కు హాజరయ్యారు. ఈ మేరకు సతీమణి బ్రాహ్మణి, కుమారుడు దేవాన్ష్‌తో కలిసి తీసుకున్న ఫొటోను 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. 'ప్రజా జీవితంలో తీరిక లేకుండా ఉన్న సమయంలో.. ఇలాంటి క్షణాలు ప్రత్యేక అనుభూతిని ఇస్తాయి. దేవాన్ష్ నవ్వు, చెప్పే ముచ్చట్లు తండ్రిగా సంతోషాన్ని స్తాయి. దేవాన్ష్‌ను చూసి గర్వపడుతున్నాను' అన్నారు మంత్రి లోకేష్. ఆయన సింగపూర్ పర్యటనకు వెళ్లి వచ్చారు.. ఆ వెంటనే దేవాన్ష్ కోసం స్కూల్‌కు వెళ్లారు.. బిజీ షెడ్యూల్ ఉన్నా సరే లోకేష్ పీటీఎంకు హాజరయ్యారు.

గత నెల 10న రాష్ట్రవ్యాప్తంగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహించగా.. శ్రీసత్యసాయి జిల్లాలో జరిగిన సమావేశానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. అక్కడ స్కూల్‌లో విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులు పరిశీలించి విద్యార్థులు, తల్లిదండ్రులకు చంద్రబాబు సూచనలు కూడా చేశారు. ఆ తర్వాత డిజిటల్ క్లాస్‌రూమ్‌లో విద్యార్థులతో చంద్రబాబు ముచ్చటించారు.. సీఎం టీచర్‌గా మారి పాఠాలు కూడా చెప్పారు. మంత్రి లోకేష్ విద్యార్థులతో కలిసి బెంచ్ మీద కూర్చున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం కూడా చేశారు. పీటీఎంలో భాగంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి నారా లోకేష్ ఆసక్తికర వ్యాఖ్యలు. తన చదువుకునే రోజుల్లో పేరెంట్ టీచర్ మీటింగ్స్ జరిగేవని.. కానీ తన తండ్రి చంద్రబాబు ఎప్పుడూ రాలేదని.. తల్లి భువనేశ్వరి మాత్రమే వచ్చేవారని గుర్తు చేసుకున్నారు. ఇప్పుడు తన కుమారు డు దేవాన్ష్ విషయంలో కూడా అదే జరుగుతోందని.. తాను పేరెంట్ టీచర్ మీటింగ్‌కు వెళ్లలేకపోతున్నానని.. తన భార్య బ్రాహ్మణి వెళ్తుందన్నారు. ఇప్పుడు చంద్రబాబు విద్యార్థుల పేరెంట్ టీచర్ మీట్‌కు హాజరయ్యార న్నారు. అయితే గత నెల 10వ తేదీన ఈ విషయాన్ని లోకేష్ ప్రస్తావించారు.. దాదాపు మూడు వారాల తర్వాత లోకేష్ తన కుమారుడు దేవాన్ష్ పేరెంట్ టీచర్ మీటింగ్‌కు హాజర య్యారు. ఈ క్రమంలో నారా లోకేష్ చేసిన వ్యాఖ్యల్ని గుర్తు చేస్తున్నారు.

## అన్నదాత సుఖీభవ పథకం డబ్బులు జమ..

ఏపీ: ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు ఆర్థిక సహాయం అందిస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ఈ పథకం ప్రారంభమైంది. అయితే రైతులు ప్రభుత్వ వెబ్‌సైట్‌లో ఆధార్ నంబర్ ద్వారా అకౌంట్‌లలో డబ్బులు పడ్డాయో లేదో స్టేటస్ తెలుసుకోవచ్చు. ఈ పథకం కింద రైతులకు ఏటా రూ.20 వేలు ఆర్థిక సహాయం అందు తుంది. రైతులు స్టేటస్ ఎలా చెక్ చేసుకోవాలి అంటే.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రారంభించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా.. ప్రకాశం జిల్లా దర్శి నియోజకవర్గం వీరాయపాలెంలో అన్నదాత సుఖీభవ పథకానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలోని 46,85,838 మంది రైతులకు "అన్నదాత సుఖీభవ" పథకం కింద ఏడాదికి రూ.20 వేల చొప్పున ఆర్థిక సహాయం అందుతుంది. మొదటి విడతగా రూ.7 వేలు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఈ పథకం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.2,342.92 కోట్లు, కేంద్ర ప్రభుత్వం రూ.831.51 కోట్లు అందిస్తున్నాయి. లబ్ధిదారుల జాబితాలో పేరు లేని రైతులు 155251 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. చాలామందికి ఆధార్, వెబ్‌ల్యాండ్ సహా పలు సమస్యలతో ఇబ్బందిపడు తున్నారు. వెంటనే ఆ



సమస్యల్ని పరిష్కరించాలని అధికారుల్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశిం చారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి అన్నదాత సుఖీభవ పథకం అందిస్తామన్నారు. అధికారులు కూడా రైతుల సమస్యల్ని పరిష్కరించే పనిలో ఉన్నారు.. డబ్బులు రానివారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. మరో అవకాశం ఉంటుందన్నారు. అన్నదాత సుఖీభ పథకానికి సంబంధించిన డబ్బులు వచ్చాయో రాలేదో తెలుసుకోవడానికి స్టేటస్ చెక్ చేసుకునే ఆప్షన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీని కోసం రైతులు ప్రభుత్వ వెబ్‌సైట్ https://annadathasukhibhava.ap.gov.inలోకి వెళ్లి.. చెక్ స్టేటస్ ఆప్షన్ క్లిక్ చేయాలి. రైతు తన ఆధార్ నంబర్ నమోదు చేసి.. పక్కనే ఉండా కాప్చాను ఎంటర్ చేసి సెర్చ్ ఆప్షన్ క్లిక్ చేస్తే అర్హుల వివరాలు కనిపిస్తాయి. అంతేకాదు ఆ రైతు ఈకేవైసీ చేసుకోవాల్సిన అవసరం ఉందో, లేదో కూడా తెలుస్తుంది అంటున్నారు. ఒకవేళ అనర్హులుగా తేలితే రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని సూచిస్తున్నారు. ప్రభుత్వం దరఖాస్తు చేసుకునేందుకు మరోసారి అవకాశం కల్పిస్తుంది అంటున్నారు. వ్యవసాయ శాఖ వెబ్‌ల్యాండ్ ద్వారా అర్హుల జాబితాను తయారు చేసింది. రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా కుటుంబం యూనిట్‌గా అర్హులను గుర్తించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ ద్వారా ఏటా రూ.20 వేల చొప్పున సాయం అందిస్తోంది. ఈ రూ.20వేలల్లో కూడా రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.14 వేలు, కేంద్రం రూ.6 వేలు ఇస్తుంది. ఈ రూ.20వేలను మూడు విడతల్లో రైతుల ఖాతాల్లో జమ చేస్తారు. పీఎం కిసాన్ కింద రూ.2 వేలు, అన్నదాత సుఖీభవ కింద రూ.5 వేలు కలిపి రూ.7 వేలు రైతుల ఖాతాల్లో జమ చేస్తారు. అర్హత ఉంటే చాలు ప్రతి ఒక్క రైతుకు అన్నదాత సుఖీభవ పథకం కింద డబ్బులు అకౌంట్‌లలో జమ చేస్తారు

## ప్రభుత్వ టీచర్లకు అద్భుత అవకాశం..

**రూ.20వేలు, ప్రశంసా పత్రం, పతకం ఇస్తారు.. దరఖాస్తు చేస్కోండి**

ఏపీ: ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా టీచర్లకు అద్భుతమైన అవకాశం కల్పించింది. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు సంబంధించి దరఖాస్తుల్ని ఆహ్వానిస్తోంది. ఈ మేరకు శుక్రవారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ నెల 8 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంది. టీచర్ల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. ఈ నెలాఖరుకు జాబితాను సిద్ధం చేసి వచ్చే నెలలో అవార్డుల్ని అందజేస్తారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర ఉత్తమ టీచర్ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ మేరకు దరఖాస్తులు శుక్రవారం నుంచి ఈ నెల 8 వరకు స్వీకరిస్తారు. డివిజన్ స్థాయిలో పరిశీలన చేసి, ఒక్కో కేటగిరీకి ముగ్గురిని ఎంపిక చేస్తారు. టీచర్ల తుది జాబితాను రాష్ట్ర స్థాయి కమిటీ ఖరారు చేస్తుంది. ఎంపికైన వారికి రూ.20 వేల నగదు, ప్రశంస పత్రం, పతకం అందిస్తారు. ఒక్కో కేటగిరీకి ముగ్గురు చొప్పున డివిజన్ స్థాయిలో ఈ నెల 11న పరిశీలించి ఎంపిక చేస్తారు. అనంతరం ఆ జాబితాను జిల్లా విద్యాధికారికి ఈ నెల 12న అందిస్తారు. ఈ నెల 14న జిల్లా స్థాయి కమిటీలో ఒక్కో కేటగిరీకి ఒకరు చొప్పున తుది జాబితాను రూపొంది స్తారు. ఆ తర్వాత ఈ నెల 16న ఈ జాబితాను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయానికి పంపిస్తారు. అనంతరం రాష్ట్ర స్థాయిలో ఈ నెల 21 నుంచి 23 వరకు ఇంటర్వ్యూలు నిర్వహి స్తారు. ఈ నెల 35న తుది జాబితాను ఖరారు చేస్తారు. ఈ మేరకు ఎంపికైన ఉపాధ్యాయులకు సెప్టెంబరు 5న రూ.20వేల నగదుతో పాటుగా ప్రశంసా పత్రం, పతకం అందజేస్తారు. పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్ జిల్లా స్థాయిలో 30 మంది, మండల స్థాయిలో 10 మందికి మించకుండా అవార్డులకు ఎంపిక చేయాలని ఆదేశించింది. రాష్ట్రవ్యాప్తంగా ఉత్తమ పని తీరు కనబరిచిన టీచర్లకు ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డును అందజేస్తారు. ఈ మేరకు రాష్ట్ర స్థాయిలో జిల్లాకు 16 మంది చొప్పున ఎంపిక చేసి.. ఆ జాబితాను జిల్లాకు పంపిస్తారు. అక్కడ పరిశీలన తర్వాత మళ్లీ రాష్ట్ర స్థాయికి పంపిస్తారు. చివరిగా ఇంటర్వ్యూలు నిర్వహించిన తర్వాత 104 మందిని ఎంపిక చేస్తారు. ఈ అవార్డుకు దరఖాస్తు చేయకపోయినా ఉత్తమ టీచర్ తరపున ఎవరైనా ఐదుగురు టీచర్లు సిఫార్సు చేసేందుకు అవకాశం కల్పించింది ప్రభుత్వం. ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ప్రభుత్వం కోరింది.



**ఎంపికైన వారికి రూ.20 వేల నగదు, ప్రశంస పత్రం, పతకం అందిస్తారు. ఒక్కో కేటగిరీకి ముగ్గురు చొప్పున డివిజన్ స్థాయిలో ఈ నెల 11న పరిశీలించి ఎంపిక చేస్తారు. అనంతరం ఆ జాబితాను జిల్లా విద్యాధికారికి ఈ నెల 12న అందిస్తారు. ఈ నెల 14న జిల్లా స్థాయి కమిటీలో ఒక్కో కేటగి రీకి ఒకరు చొప్పున తుది జాబితాను రూపొంది స్తారు. ఆ తర్వాత ఈ నెల 16న ఈ జాబితాను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయానికి పంపిస్తారు.**

## ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిరగక్కర్లేదు..

ఏపీ: ప్రభుత్వం ఆస్తి పన్ను చెల్లింపు ప్రక్రియను సులభతరం చేస్తోంది. ఇకపై ఆన్‌లైన్‌లోనే డిమాండ్ నోటీసులు జారీ చేస్తారు. నగదు రహితంగా పన్నులు చెల్లించేందుకు అవకాశం కల్పిస్తారు. అలాగే ఆన్‌లైన్, వాట్సాప్ ద్వారా పన్నులు కట్టే వెసులుబాటు కల్పిస్తున్నారు. పన్నుల విధానంలో పారదర్శకత పెంచడానికి స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో రికార్డులను అప్‌లోడ్ చేశారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గ్రామ పంచాయతీల్లో ఆస్తి పన్ను చెల్లింపు ప్రక్రియలో మార్పులు చేస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరం నుంచి ఆన్‌లైన్‌లోనే ఆస్తి పన్ను డిమాండ్ నోటీసులు జారీ చేస్తారు. నగదు రహితంగా పన్ను వసూళ్లు చేయడానికి పంచాయతీరాజ్ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఆన్‌లైన్, వాట్సాప్ ద్వారా పన్నులు కట్టే వెసులుబాటు కల్పిస్తున్నారు. పన్నుల విధానంలో పారదర్శకత పెంచడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో పంచాయతీ రికార్డుల్లో ఉన్న ఇళ్లు, భవనాలు, షాపుల వివరాలను అప్‌లోడ్ చేశారు. ఈ వివరాలను మళ్ళీ సరి చూసే ప్రక్రియ కూడా పూర్తయింది. త్వరలోనే ప్రజలకు కొత్త విధానం అందుబాటులోకి రానుంది. రాష్ట్రంలోని పంచాయతీల్లో ఆస్తి పన్ను వసూళ్లను మెరుగుపరచడానికి ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. ఆస్తి పన్నుకు సంబంధించి గతేడాది రూ.650 కోట్ల ఆదాయం రాగా.. ఈ ఏడాది రూ.750 కోట్లకు పైగా వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో పన్ను వసూళ్లు సరిగా లేవు.. ప్రజల నుంచి ఎంత వసూలు చేశారో, పంచాయతీ బ్యాంకు ఖాతాలో ఎంత జమ చేశారో కూడా కార్యాలయాల్లో సరైన లెక్కల్లేవు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంటోంది.


అవినీతి, అక్రమాలకు అడ్డుకట్ట వేయడానికి ప్రభుత్వం స్వర్ణ పంచాయతీ పేరుతో పోర్టల్‌ను ప్రారంభించిన సంగతి తెలిసిందే. పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కార్యాలయంలోని ఐటీ విభాగం ఇళ్లు, భవనాలు, ఇతర ఆస్తుల వివరాలను పోర్టల్‌లో నమోదు చేసింది. దీని ద్వారా పన్ను వసూళ్లను పర్యవేక్షించవచ్చు. పంచాయతీల ఆదాయంలో ఆస్తి పన్ను చాలా ముఖ్యమని చెప్పాలి. ఆ దిశగా ప్రభుత్వం పన్నుల విషయంలో అవినీతిని అరికట్టడానికి చర్యలు తీసుకుంటోంది. ఏపీ ప్రభుత్వం ఇప్పటికే భవనాల నిర్మాణాల అనుమతుల కోసం దరఖాస్తు చేసుకునే విధానాన్ని సులభతరం చేసింది. తాజాగా పన్ను చెల్లింపుల్ని కూడా మరింత సులభతరం చేసే దిశగా అడుగులు వేస్తోంది. త్వరలోనే ఈ పన్నుల చెల్లింపు కొత్త విధానానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలుస్తాయి.

## కార్డు లేకపోయినా ఆరోగ్యశ్రీ కింద వైద్యం..

ఏపీ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ (ఆరోగ్యశ్రీ)కు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆసుపత్రుల ద్వారా 3,257 రకాల వ్యాధులకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నారు. పేదలు, మధ్య తరగతివారు, ఇలా కార్డులున్న ప్రతి ఒక్కరు సేవలు పొందుతున్నారు. అయితే ఒకవేళ కార్డు లేకపోతే.. వాళ్లకు ముఖ్యమంత్రి కార్యాలయం అనుమతితో వైద్యం అందుతుంది. ఒకవేళ ఆరోగ్యశ్రీ కార్డు లేని వాళ్లు ఎవరైనా జబ్బు పడితే ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రికి వెళ్లాలి. అక్కడ ఆరోగ్యమిత్ర అనే వ్యక్తిని కలవాలి.. వారు జిల్లా సమన్వయకర్త కార్యాలయానికి సమాచారం ఇస్తారు. అర్హతలను చూసి, నుంచి అనుమతి తీసుకుంటారు. ఆ తర్వాత వైద్య సేవలు అందుతాయి.. ప్రతిరోజు జిల్లాలో 20 నుంచి 30 మందికి ఇలా అనుమతులు ఇస్తున్నారు. ఎన్టీఆర్ వైద్యసేవ కార్డు ఉన్న కుటుంబాలకు రూ. 5 లక్షల వరకు ఉచిత వైద్యం అందుతుంది. వినికిడి, మాటలు రాని సమస్యలతో పుట్టిన పిల్లలకు రూ. 12 లక్షల వరకు ఖర్చు చేయొచ్చు. క్యాన్సర్ రోగులకు ఎంత ఖర్చయినా ఉచితంగా వైద్యం అందిస్తారు. %జునూ% లో రూ. 1000 దాటితే 836 రకాల జబ్బులకు, ఆరోగ్యశ్రీలో 3,257 రోగాలకు ఉచితంగా వైద్యం లభిస్తుంది. సంవత్సరానికి రూ. 5 లక్షలు లేదా అంతకంటే తక్కువ ఆదాయం ఉన్నవారు ఈ పథకాలకు అర్హులు.

ఎన్టీఆర్ వైద్యసేవ కార్డు ఉన్నవారికి ఇది చాలా ఉపయోగకరమైన పథకం. దీని ద్వారా పేద ప్రజలకు మంచి వైద్యం అందుతుంది. పుట్టుకతో వచ్చే చెవుడు, మూగ సమస్యలకు కూడా ప్రభుత్వం సహాయం చేస్తుంది. క్యాన్సర్ వ్యాధికి కూడా ఉచితంగా అది కూడా అపరిమితంగా వైద్యం అందిస్తున్నారు. ఈ కార్డు ఉంటే చాలా వరకు వైద్య ఖర్చుల గురించి భయపడాల్సిన అవసరం లేదు. 'రూ.వెయ్యి దాటితే ఈహెచ్‌ఎస్‌లో 836, ఆరోగ్యశ్రీలో 3,257 రోగాలకు ఉచిత వైద్యం వర్తిస్తుంది.12 ఎకరాల లోపు మాగాణి భూమి, 35 ఎకరాల లోపు మెట్ట భూమి ఉన్న రైతులు ఈ పథకానికి అర్హులు. మాగాణి, మెట్ట కలిపి 35 ఎకరాల లోపు ఉన్నా కూడా అర్హులే. శాశ్వత ఉద్యోగులు, పెన్షనర్లు కాకుండా రూ.5 లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్న ఇతర ఉద్యోగులు కూడా ఈ పథకంలో చేరవచ్చు. కుటుంబానికి ఒక కారు ఉన్నా సమస్య లేదు. మున్సిపాలిటీలు, కార్పొరేష్ల పరిధిలో 3వేల చదరపు అడుగుల కంటే తక్కువ ఆస్తి పన్ను చెల్లించే వారు కూడా పేర్లు నమోదు చేసుకోవచ్చు' అని అధికారులు తెలిపారు.

ట్రస్ట్ పరిధిలోని ఆసుపత్రుల్లో ఆరోగ్యమిత్రల వ్యవస్థ రోగులకు ఉచిత సేవలు అందిస్తుంది. ఆరోగ్యమిత్రలు ఉచితంగా సేవలు అందిస్తారు. డిశ్చార్జ్ అయ్యాక రవాణా ఛార్జీలు కూడా ఇస్తారు. రోగుల



నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవడానికి ఐవీఆర్ఎస్ విధానాన్ని ఉపయోగిస్తున్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఎక్కువ డబ్బులు వసూలు చేస్తే ఫిర్యాదు చేయొచ్చు. డబ్బులు ఎక్కువగా తీసుకుంటే ఫిర్యాదు చేయడానికి 104, 14400 టోల్ ఫ్రీ నంబర్లు ఉన్నాయి. అలాగే ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన కార్డులు ఉన్నవాళ్లకి దేశంలో ఎక్కడైనా.. ఒప్పందం ఉన్న ఆసుపత్రిలో వైద్యం చేయించుకోవచ్చు.

# బ్యాంకుల్లో డబ్బులు దాచుకుంటున్నారా?



బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసే వారి సంఖ్య ఇటీవలి కాలంలో పెరిగిపోయింది. ఆకర్షణీయ స్థాయిలో వడ్డీ రేట్లు వస్తుండటం దీనికి కారణంగా చెప్పొచ్చు. ఆర్‌బీఐ కిందటేడాది మార్చి నుంచి వరుసగా రెపో రేట్లను పెంచుకుంటూ పోతున్న వేళ బ్యాంకులు.. లపై మంచి వడ్డీ అందిస్తున్నాయి. అయితే ఇప్పుడు ఏ బ్యాంకులో ఎఫ్‌డీ వడ్డీ రేట్లు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం.ప్రజలకు ఇన్వెస్ట్‌మెంట్లపై మనసు మళ్లింది. ముఖ్యంగా కరోనా తర్వాతి కాలంలో ప్రజల్లో ధోరణి మారింది. ఇక పొదుపులో స్టాక్ మార్కెట్లు, మ్యూచువల్ ఫండ్లు వంటివి ఉన్నప్పటికీ.. వీటిల్లో రిస్క్ ఉంటుందని చెప్పొచ్చు. అందుకే బ్యాంకుల్లో చేసే వారి సంఖ్య పెరిగింది. భారతీయ రిజర్వ్ బ్యాంక్ గత సంవత్సరం నుంచి వరుసగా రెపో రేట్లను పెంచుకుంటూ పోయింది. ఈ క్రమంలోనే 250 బేసిస్ పాయింట్లు పెంచి 4 శాతం నుంచి 6.50 శాతానికి చేర్చింది. ఇక ఫిక్స్‌డ్ డిపాజిట్లు.. కేవలం సీనియర్ సిటజెన్లకు మాత్రమే కాదు.. ఎవరికైనా నిర్దిష్ట కాల వ్యవధిలో మంచి రాబడి రావాలనుకుంటే వీటిని ఎంచుకోవచ్చు.

అయితే ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసే ముందు వడ్డీ రేట్లను పోల్చుకోవాలి. ఏ బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లపై ఎక్కువ వడ్డీ వస్తుందో చూడాలి. ఒక్కో బ్యాంకులో వడ్డీ రేట్లు ఒక్కోలా ఉంటాయి. ఇంకా టెన్యూర్లను బట్టి మారుతుంటాయి. అయితే రూ. కోటి లోపు డిపాజిట్లపై వడ్డీ రేట్లు ఏ బ్యాంకులో ఎలా ఉన్నాయో మనం ఇప్పుడు చూద్దాం. 6 నెలల నుంచి ఏడాది లోపు టెన్యూర్ ఉన్న డిపాజిట్లపై స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 5.25 శాతం నుంచి 5.75 శాతం వడ్డీ వస్తుంది. అదే ఏడాది నుంచి రెండేళ్ల టెన్యూర్ ఉన్న డిపాజిట్లపై 6.80- 7.10 శాతం వడ్డీ ఆఫర్ చేస్తోంది. రెండేళ్ల నుంచి మూడేళ్ల డిపాజిట్లపై 7 శాతం వడ్డీ వస్తోంది. ఇక ఐదేళ్లు పైబడిన డిపాజిట్లపై 6.50 శాతం వడ్డీ ఇస్తోంది. ఐసీఐసీఐ బ్యాంకులో చూస్తే వడ్డీ రేట్లు 6 నెలల నుంచి ఏడాది లోపు డిపాజిట్లపై మాత్రం 4.75 శాతం నుంచి 6 శాతం వడ్డీ వస్తోంది. ఏడాది నుంచి రెండేళ్ల వ్యవధి డిపాజిట్లపై 6.70 శాతం నుంచి 7.10 శాతం వరకు వడ్డీ ఆఫర్ చేస్తోంది. 2 సంవత్సరాల నుంచి 3 సంవత్సరాల డిపాజిట్లపై 7-7.10 శాతం వడ్డీ ఇస్తోంది. ఐదేళ్ల కంటే ఎక్కువ టెన్యూర్ డిపాజట్లపై ఐసీఐసీఐ బ్యాంక్.. 6.9 శాతం నుంచి 7 శాతం వరకు ఇస్తోంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో 6 నెలల నుంచి ఏడాది టెన్యూర్ ఉన్న లపై 4.50 శాతం నుంచి 6 శాతం వడ్డీ ఆఫర్ చేస్తోంది. సంవత్సరం నుంచి 2 ఏళ్ల కాల పరిమితి ఉన్న డిపాజిట్స్‌పై మాత్రం 6.60 శాతం నుంచి 7.10 శాతం వడ్డీ ఇస్తోంది. ఇక 2 సంవత్సరాల నుంచి మూడేళ్ల వ్యవధి ఉన్న డిపాజిట్లపై 7-7.15 శాతం ఇస్తోంది. పంజాబ్ నేషనల్ బ్యాంకులో ఏడాది లోపు టెన్యూర్ ఉన్న డిపాజిట్లు చేసే వారికి 6 నుంచి 6.25 శాతం వడ్డీ వస్తోంది. ఏడాది నుంచి రెండేళ్లపై 6.75 శాతం నుంచి 7.25 శాతం వడ్డీ వస్తోంది. ఇక రెండేళ్ల నుంచి మూడేళ్ల వ్యవధి డిపాజిట్లపై 6.80- 7 శాతం వడ్డీ వస్తోంది. ఐదేళ్లు పైబడిన టెన్యూర్ డిపాజిట్లపై 6.50 శాతం వడ్డీ ఆఫర్ చేస్తోంది.

# దిగ్గజ బ్యాంక్ గుడ్‌న్యూస్..



దేశంలో 85 ఏళ్ల చరిత్ర కలిగిన దిగ్గజ బ్యాంక్ తమ కస్టమర్లకు గుడ్‌న్యూస్ చెప్పింది. రూ.2 కోట్ల లోపు ఉన్న ఫిక్స్‌డ్ డిపాజిట్ వడ్డీ రేట్లను సవరిస్తున్నట్లు తెలిపింది. అందులో ఆ స్పెషల్ స్కీమ్ వడ్డీ రేటు పెంచింది. కొత్త రేట్లు ఎలా ఉన్నాయో ఇప్పుడు మనం తెలుసుకుందాం. 5 ఏళ్ల చరిత్ర కలిగిన ప్రైవేట్ రంగ బ్యాంకు జమ్మూ కాశ్మీర్ బ్యాంకు తమ కస్టమర్లకు శుభవార్త అందించింది. రూ. 2 కోట్ల లోపు ఉన్న ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను సవరిస్తున్నట్లు ప్రకటించింది. అందులో 555 రోజుల స్పెషల్ ఎఫ్‌డీ స్కీమ్ వడ్డీ రేట్లను 40 బెసిస్ పాయింట్ల మేర పెంచుతున్నట్లు తెలిపింది. ఈ సవరించిన వడ్డీ రేట్లు నవంబర్ 11, 2023 నుంచి అమల్లోకి వచ్చాయని బ్యాంకు తెలిపింది. ఈ బ్యాంకు 1938 వ సంవత్సరంలో ప్రారంభమైంది.

555 రోజుల స్పెషల్ ఎఫ్‌డీ స్కీమ్..

జమ్మూకశ్మీర్ బ్యాంకు తమ కస్టమర్ల కోసం 555 రోజుల స్పెషల్ ఫిక్స్‌డ్ డిపాజిట్ స్కీమ్ అందిస్తోంది. తాజాగా ఈ స్పెషల్ ఎఫ్‌డీ వడ్డీ రేట్లను 40 బేసిస్ పాయింట్లు పెంచింది. ప్రస్తుతం డొమెస్టిక్, ఎన్ఆర్ఈ, ఎన్ఆర్ఓ కస్టమర్లకు 7.10 శాతంగా ఉన్న వడ్డీ రేట్లను 7.50 శాతానికి పెంచింది. అలాగే సీనియర్ సిటిజన్లకు 8 శాతం వడ్డీ రేట్లను అందిస్తోంది. జమ్మూకశ్మీర్ లేటెస్ట్ ఎఫ్‌డీ రేట్లు.. 7 రోజుల నుంచి 45 రోజుల వరకు టెన్యూర్ కలిగిన ఫిక్స్‌డ్ డిపాజిట్లపై 3.50 శాతం వడ్డీ రేటును అందిస్తోంది.46 రోజుల నుంచి 90 రోజుల డిపాజిట్లపై 4. 60 శాతం వడ్డీ రేటు ఆఫర్ చేస్తోంది.91 రోజుల నుంచి 180 రోజుల టెన్యూర్ డిపాజిట్లపై 4. 75 శాతం వడ్డీ అందిస్తుంది.181 రోజుల నుంచి 270 రోజుల డిపాజిట్లపై 5.60 శాతం వడ్డీ రేటు ఆఫర్ చేస్తోంది.222 రోజుల కాలపరిమితి కలిగిన ఫిక్స్ డిపాజిట్లపై బ్యాంకు 6. 30 శాతం వడ్డీ రేటు ఇస్తోంది.271 రోజుల నుంచి 332 రోజుల డిపాజిట్లపై బ్యాంకు 6. 00 శాతం వడ్డీ రేటు కల్పిస్తోంది.333 రోజుల టెన్యూర్ కలిగిన ఫిక్స్‌డ్ డిపాజిట్లపై 6.60 శాతం వడ్డీ రేటు ఆఫర్ చేస్తోంది.334 రోజుల నుంచి ఒక ఏడాది లోపు డిపాజిట్లపై 6. 00 శాతం వడ్డీ అందిస్తుంది.ఒక ఏడాది నుంచి 554 రోజుల వరకు డిపాజిట్లపై బ్యాంకు 7.10 శాతం వడ్డీ అందిస్తోంది. 555 రోజుల కాల పరిమితి కలిగిన డిపాజిట్లపై 7. 50 శాతం వడ్డీ రేటును అందిస్తుంది. 556 రోజుల నుంచి రెండు ఏళ్లలోపు డిపాజిట్లపై బ్యాంకు 7. 10 శాతం వడ్డీ కల్పిస్తోంది. 2 ఏళ్ల నుంచి 3

# సహారా గ్రూప్ చీఫ్ మృతి..



సహారా గ్రూప్ అధినేత సుబ్రతా రాయ్ మంగళవారం రాత్రి కన్నుమూశారు. ఆయన మరణానంతరం ప్రధానంగా సెబీ వద్ద ఉన్న రూ.25 వేల కోట్ల నగదు ఫోకస్‌లోకి వచ్చింది. సహారా గ్రూప్ వ్యవస్థాపకులు, ఛైర్మన్ సుబ్రతా రాయ్ కన్నుమూశారు. 75 ఏళ్ల ఆయన గుండెపోటు రావడంతో మంగళవారం రాత్రి 10.30 గంటల ప్రాంతంలో తుది శ్వాస విడిచినట్లు సహారా గ్రూప్ ప్రకటన చేసింది. అయితే, ఇప్పుడు ఓ అంశం తెరపైకి వచ్చింది. అదే సెబీ వద్ద పంపిణీ చేయకుండా ఉన్న రూ.25 వేల కోట్ల నిధులు అంశం వెలుగులోకి వచ్చింది. ఆ డబ్బులు సహారా ఇన్వెస్టర్లకు పంపిణీ చేస్తారా? సుబ్రతా రాయ్ మృతి నేపథ్యంలో ఏం జరగనుంది? అనేది ప్రస్తుతం చర్చకు దారి తీసింది. ఆ వివరాలు ఓసారి పరిశీలించే ప్రయత్నం చేద్దాం. సహారా గ్రూప్ చీఫ్ సుబ్రతా రాయ్ మరణానంతరం క్యాపిటల్ మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ ఖాతాల ఉన్న పంపిణీ చేయని ఫండ్స్ రూ.25 వేల కోట్లు ప్రస్తుతం ఫోకస్ లోకి వచ్చాయి. ఆయన పోజీ స్కీమ్‌లతో నిబంధనలు అతిక్రమించినట్లు నియంత్రణ, చట్టపరమైన ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. 2011లో క్యాపిటల్ మార్కెట్స్ రెగ్యులేటర్ సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజీ బోర్డ్ ఆఫ్ ఇండియా సెబీ.. రెండు సహారా గ్రూప్ సంస్థలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. అందులో సహారా ఇండియా రియల్ ఎస్టేట్ కార్పొరేషన్ లిమిటెడ్, సహారా హౌసింగ్ ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌లు ఉన్నాయి. బాండ్ల ద్వారా సుమారు 3 కోట్ల మంది ఇన్వెస్టర్ల ద్వారా సేకరించిన డబ్బులను రిఫండ్ చేయాలని ఆదేశించింది సెబీ. తమ రూల్స్, రెగ్యులేషన్స్‌ను అతిక్రమించినట్లు గుర్తించిన క్రమంలో ఈ ఆదేశాలు జారీ చేసింది సెబీ. దీర్ఘకాలం పాటు ఈ అంశంపై పోరాటం చేశారు సహారా చీఫ్ సుబ్రతా రాయ్. అయితే, సుప్రీం కోర్టులో ఆయనకు ఎదురుదెబ్బ తగిలింది. ఆగస్టు 31, 2012న సెబీ ఆదేశాలను సమర్థిస్తూ సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు ఇచ్చింది. సహారాకు చెందిన ఆ రెండు సంస్థలు ఇన్వెస్టర్ల నుంచి వసూలు చేసిన డబ్బులను 15 శాతం వడ్డీ రేటుతో తిరిగి చెల్లించాల్సిందేనని స్పష్టం చేసింది. అయితే, 95 శాతానికిపైగా ఇన్వెస్టర్లకు నేరుగా రిఫండ్ చేసినట్లు గ్రూప్ వెల్లడించింది. అయినప్పటికీ పెట్టుబడిదారులకు తదుపరి రిఫండ్ కోసం సెబీ వద్ద దాదాపు రూ.24 వేల కోట్లు డిపాజిట్ చేయాల్సిందిగా సుప్రీం కోర్టు తెలిపింది. 11 ఏళ్ల తర్వాత సుమారు రూ.138.07 కోట్లు రీఫండ్ చేసినట్లు సమాచారం. మరోవైపు.. సెబీ ప్రత్యేకంగా తెరిచిన బ్యాంక్ ఖాతాలో రూ.24 వేల కోట్లు జమ చేయగా.. ఇప్పుడు అవి రూ.25 వేల కోట్లకు చేరినట్లు తెలుస్తోంది. సెబీ వార్షిక నివేదిక ప్రకారం.. మార్చి 31, 2023 నాటికి 19,650 దరఖాస్తులు వచ్చాయి. అందులో 17,526 దరఖాస్తులకు సంబంధించి రూ. 138.07 కోట్లు రిఫండ్ చేసింది. అందులో వడ్డీ రూ.67.98 కోట్లుగా ఉన్నట్లు తెలిపింది. మిగిలిన దరఖాస్తుల కు సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించక పోవడంతో వాటిని తిరస్కరించినట్లు తెలిపింది. ప్రస్తుతం సహారా గ్రూప్ అధినేత సుబ్రతా రాయ్ మృతి చెందిన క్రమంలో మరోసారి ఆ రూ.25 వేల కోట్లు ఫోకస్‌లోకి వచ్చాయి. ప్రస్తుతం సెబీ ఎలాంటి నిర్ణయం తీసుకోనుందని వేచి చూడాల్సిందే.

# పీఎం కిసాన్ డబ్బులు పడ్డాయ్..

పీఎం కిసాన్ నిధుల్ని ప్రధాని నరేంద్ర మోదీ విడుదల చేశారు. నవంబర్ 15న ఝూరడ్ పర్యటనలో ఉన్న ప్రధాని.. 15వ విడత డబ్బుల్ని రైతుల అకౌంట్లలో వేశారు. మొత్తం 8 కోట్ల మందికిపైగా అర్హులైన రైతుల ఖాతాల్లోకి రూ. 18 వేల కోట్లకుపైగా నగదు జమ అయింది. ఈ స్కీం కింద 15వ విడతలో భాగంగా ఒక్కో రైతు అకౌంట్లోకి రూ. 2 వేలు వచ్చి చేరాయి. పీఎం కిసాన్ అధికారిక పోర్టల్ ప్రకారం.. పీఎం కిసాన్ రిజిస్టర్డ్ రైతులు ఇ-కేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలి. పీఎం కిసాన్ పోర్టల్‌లో ఈ ఓటీపీ బేస్డ్ ఇకేవైసీ అందుబాటులో ఉంది. బయోమెట్రిక్ బేస్డ్ ఇ-కేవైసీ కోసం అయితే కామన్ సర్వీస్ సెంటర్లను సందర్శించాలి. రైతుల సంక్షేమం కోసం.. పంట సాయం అందించే ఉద్దేశంతో కేంద్రం.. దీనికింద అర్హులైన రైతులకు ఏటా పంటసాయం కింద రూ. 6 వేలు అందిస్తోంది. ప్రతి 4 నెలల కు ఓసారి రూ. 2 వేల చొప్పున ఇస్తోంది. ఈ డబ్బు లు నేరుగా రైతుల అకౌంట్లలో జమవుతాయి. ఇకేవైసీ పూర్తి చేసిన రైతుల ఖాతాల్లో మాత్రమే డబ్బు లు పడతాయని కేంద్రం ఇప్పటికే స్పష్టం చేసింది. డబ్బులు పడకున్నా.. అసలు బెనిఫిషియరీ లిస్ట్‌లో మీ పేరు ఉందో లేదో కూడా చెక్ చేసుకోవచ్చు. దీని కోసం పీఎం కిసాన్ పోర్టల్‌లో బెనిఫిషియరీ లిస్ట్‌లో మీ రాష్ట్రం, జిల్లా, ఉప జిల్లా , బ్లాక్, విలేజ్ ఎంటర్ చేసి గెట్ రిపోర్ట్‌పై క్లిక్ చేయాలి. అక్కడ మీ పేరు ఉందో లేదో తెలుస్తోంది.

# సెకెనుకి 150 సినిమాలు..

గత రెండు దశాబ్దాల్లో ప్రపంచ అభివృద్ధిలో చైనా తనదైన ముద్ర వేస్తోంది. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ అమెరికా వంటి అగ్రరాజ్యాన్ని సైతం అధిగమించి ముందుకెళ్తోంది. తాజాగా, ఇంటర్నెట్ సేవలకు సంబంధించిన మరో సంచలనానికి తెరతీసింది డ్రాగన్. ఏకంగా ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన ఇంటర్నెట్‌ను ఆవిష్కరించి.. ఆశ్చర్యానికి గురిచేసింది. దీని వేగం 1.2 టెరా బైట్స్ కాగా.. ఇప్పటి వరకూ అమెరికాలో ఉన్న 5 జీ వేగం 400 గిగా బైట్లు. సాంకేతిక అభివృద్ధి విషయంలో చైనా మరో సంచలనా నికి తెరతీసింది. ప్రపంచంలోని అత్యంత వేగ వంతమైన ఇంటర్నెట్ నెట్‌వర్క్‌ను చైనా సంస్థ లు సోమవారం ఆవిష్కరించాయి. సెకనుకు 1.2 టెరాబైట్ డేటాను ప్రసారం చేయగల సామర్థ్యం దీని సొంతమని సౌత్ చైనా మార్నిం గ్ పోస్ట్ కథనం పేర్కొంది. ఈ వేగం ప్రస్తుత ప్రధాన ఇంటర్నెట్ మార్గాల కంటే పది రెట్లు ఎక్కువని తెలిపింది.



ఈ ప్రాజెక్ట్‌ను సింఘువా విశ్వవిద్యాలయం, చైనా మొబైల్, హువాయ్ టెక్నాలజీస్, సెర్నెట్ కార్పొరేషన్ సంయుక్తంగా చేపట్టాయి. మొత్తం 3,000 కిలోమీటర్లకు పైగా విస్తరించిన ఈ నెట్‌వర్క్.. బీజింగ్, వుహాన్, గ్వాంగ్జూలను విస్తృతమైన ఆప్టికల్ ఫైబర్ కేబులింగ్ సిస్టమ్ ద్వారా అనుసంధానం చేస్తుంది. సెకనుకు 1.2 టెరాబైట్‌ల (1,200 గిగాబైట్‌లు) డేటాను ప్రసారం చేసే సామర్థ్యా న్ని కలిగి ఉంది. ప్రస్తుతం ప్రపంచంలోని చాలా ఇంటర్నెట్ నెట్‌వర్క్‌లు సెకనుకు కేవలం 100 గిగాబైట్ల వేగంతో పనిచేస్తాయి. అమెరికా ఇటీవలే సెకనుకు 400 గిగాబైట్ల వేగంతో 5జీ ఇంటర్నెట్‌ను ఆవిష్కరించింది. ముఖ్యంగా బీజింగ్-వుహాన్-గ్వాంగ్జూ కనెక్షన్ చైనా భవిష్యత్తు ఇంటర్నెట్ టెక్నాలజీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో భాగం. దశాబ్దం పాటు కొనసాగిన కార్యాచరణ, జాతీయ చైనా ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ నెట్‌వర్క్ (సెర్నెట్) కృషికి ఫలితం ఇది. జులైలో యాక్టివ్ చేసిన ఈ ప్రాజెక్టును సోమవారం అధికారికంగా ప్రారంభించారు. నెట్‌వర్క్ అన్ని ఆపరేషనల్ పరీక్షలను విజయవంతంగా పూర్తిచేసి, విశ్వసనీ యంగా పనిచేసినట్టు అధికారులు తెలిపారు. హువాయి టెక్నాలజీస్ వైస్-ప్రెసిడెంట్ వాంగ్ లీ మాట్లాడుతూ.. నెట్‌వర్క్ నిజంగా ఎంత వేగం గా ఉందో అర్థం చేసుకోవడానికి ఇదో ఉదా హరణ అని అన్నారు. 'ఇది కేవలం ఒక సెకను లో 150 హై-డెఫినిషన్ ఫిల్మ్‌లకు సమానమైన డేటాను బదిలీ చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉంది' అని వివరించారు. 'సూపర్‌ఫాస్ట్ లైన్ విజయవంతమైన ఆపరేషన్ మాత్రమే కాదు, చైనాకు ఇంకా వేగవంతమైన ఇంటర్నెట్‌ను నిర్మించడానికి అధునాతన సాంకేతికతను కూడా అందిస్తుంది'అని చైనీస్ అకాడమీ ఆఫ్ ఇంజనీరింగ్‌కు చెందిన ఎఫ్ఐటీఐ ప్రాజెక్ట్ లీడర్ వు జియాన్‌పింగ్ వ్యాఖ్యానించారు. సింఘువా యూనివర్సిటీకి చెందిన జు మింగ్‌వీ దీనిని సూపర్‌ఫాస్ట్ రైలు ట్రాక్‌తో పోల్చారు. అదే స్థాయిలో డేటాను తీసుకువెళ్లేందుకు 10 సాధారణ ట్రాక్‌ల అవసరాన్ని ఇది భర్తీ చేస్తుందని, ఫలితంగా మరింత ఖర్చుతో కూడుకున్న, నిర్వహించదగిన వ్యవస్థ ఏర్పడుతుందని వివరించారు. దీనికి అవసరమైన సిస్టమ్ సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ అన్నీ దేశీయంగా తయారుచేసినట్టు ఆయన వెల్లడించారు.



# నా బ్లడ్‌తో మా నాన్న వయసు తగ్గిపోయింది

భూమిపై పుట్టిన ప్రతి జీవీ గిట్టక మానదు.. ఎంతటి వాళ్లైనా మరణాన్ని తప్పించుకోలేరు. కానీ, అందుబాటులోకి వచ్చిన ఆధునిక శాస్త్ర సాంకేతిత, వైద్యం ద్వారా వయసురీత్యా శరీరంలో వచ్చే మార్పులను మాత్రం తప్పించుకోవచ్చని చెబుతున్నారు. వయసు పెరుగుతున్నా కొద్దీ తమ శరీరంలో చోటుచేసుకునే మార్పులపై చాలా మంది నిరాశకు గురవుతారు. ఈ నిరుత్సాహాన్ని తగ్గించేందుకు సరికొత్త టెక్నాలజీ పుట్టుకొచ్చింది దీని ద్వారా ఆరోగ్యకరంగా, ఎక్కువ కాలం జీవించే అవకాశం ఉంటుందని శాస్త్రవేత్తలు అంటున్నారు.

అమెరికాకు చెందిన వ్యాపారవేత్త బ్రెయిన్ జాన్సన్ జన్యుపరమైన చికిత్సతో తన వయసు తగ్గించుకోడానికి ఏడాదికి కోట్లాది రూపాయలను ఖర్చుచేస్తున్న సంగతి తెలిసిందే. అయితే, ఈ చికిత్స వల్ల తన వయసు మాత్రమే కాకుండా అతడి తండ్రి వయసు కూడా తగ్గిపోయిందని చెప్పాడు. తన రక్తాన్ని ఎక్కించుకున్న తన తండ్రి వయసు 25 ఏళ్లు తగ్గిపోయిందని ట్వీట్ చేశాడు. తన ఒంటి నుంచి తీసిన లీటరు ప్లాస్మాను 71 ఏళ్ల వయసున్న తన తండ్రికి ఎక్కించడంతో ఆయన వయసు 46కు తగ్గిపోయిందని ట్విట్టర్‌లో వెల్లడించాడు. అయితే, ఈ ప్రక్రియలో చాలా జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందని, ఫలితాల విషయంలో కొన్ని పరిమితులను గుర్తించినట్టు తెలిపారు. 'నా రక్తంలోని లీటరు ప్లాస్మాను స్వీకరించిన తర్వాత మా నాన్న (71 ఏళ్లు) వృద్ధాప్య వేగం 25 సంవత్సరాలకు సమానంగా తగ్గింది.. చికిత్స తీసుకున్న ఆరు నెలల తర్వాత కూడా అదే స్థాయిలో ఉంది. అంటే ఏమిటి? మనం ఎంత పెద్దవారైతే అంత వేగంగా వృద్ధాప్యం వస్తుంది. నా ప్లాస్మాలో 1 లీటరు తీసుకున్న తర్వాత మా నాన్న 46 ఏళ్ల వయస్సుకు తగ్గిపోయారు.. గతంలో అతను 71 ఏళ్ల వయస్సు వృద్ధాప్యంలో ఉన్నాడు. నేను అతడి రక్తం పంచుకుపుట్టిన వ్యక్తిని' అని ట్వీట్ చేశారు. ఆయన వృద్ధాప్య రేటు తగ్గడానికి కారణం తన నుంచి తీసుకున్న లీటరు కంటే అతడి స్వంత ప్లాస్మాలోని 600 మిల్లీలీటర్లను తొలగించడం వల్ల కావచ్చునని కూడా అభిప్రాయపడ్డారు. కాగా, ఇటీవల ఓ ఇంటర్వ్యూలో వయసు తగ్గించేందుకు తాను తీసుకుంటున్న చికిత్సల గురించి బ్రెయిన్ వెల్లడించిన విషయం తెలిసిందే. చికిత్సలో భాగంగా రోజుకు 111 ఔషధాలను తీసుకుంటూ.. పురోగతిని ట్రాక్ చేయడానికి వివిధ ఆరోగ్య పర్యవేక్షణ పరికరాలను కూడా ఉపయోగిస్తున్నారు. తలపై ఎరుపు కాంతికి, మలం నమూనాలను సేకరించడానికి బేస్ బాల్ టోపీని ధరిస్తారు. అంతేకాదు, రాత్రివేళ అంగస్తంభనలను గమనించేందుకు పురుషాంగానికి చిన్న జెట్ ప్యాక్‌ను అమర్చి నిద్రపోతారు. తన మొత్తం శరీరాన్ని యాంటీ ఏజింగ్ అల్గారిథమ్‌కి మార్చడమే లక్ష్యమని జాన్సన్ చెప్పారు. ప్రస్తుతం ఆయన వయసు 46 ఏళ్లు కాగా.. అవయవాలు 18 ఏళ్ల యువకుడిలా పనిచేయించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఉదయం 5 గంటల కల్లా నిద్రలేచే జాన్సన్.. 11 గంటలకే లంచ్ పూర్తిచేస్తారు. ఉదయం 6 నుంచి 11 గంటల మధ్య 2,250 క్యాలరీల ఆహారం తీసుకుంటారు. రాత్రి 8.30 గంటలకే నిద్రపోతారు. ఈ చికిత్స కోసం ఏకంగా 30 మంది వైద్యులను నియమించుకోవడం గమనార్హం.

# పాకిస్థాన్ ఆర్థిక సంక్షోభంతో ఆయుధాలు అమ్ముకుంటోందా..?

పాకిస్థాన్‌లో ప్రస్తుతం దారుణమైన పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతోంది. ఒకవైపు రాజకీయంగా అస్థిరత ఏర్పడగా.. మరోవైపు.. ఆర్థిక సంక్షో భంతో తీవ్ర ఇబ్బందుల్లో చిక్కుకుంది. ఈ క్రమంలోనే ఆ దేశం గురించి సంచలన విషయం ఒకటి బయట పడింది. ఆర్థికంగా తీవ్రంగా కూరుకుపోయిన పాక్.. తమ వద్ద ఆయుధాలను బయటి దేశాలకు విక్రయించి.. డబ్బులు సమకూర్చుకుంటోందని కథనాలు వెలువడటం సంచలనంగా ఆర్థిక సంక్షోభం నుంచి బయటికి వచ్చేందుకు తమ వద్ద ఉన్న ఆయుధాలను విక్రయిస్తోందని పాక్ మీడియా పేర్కొనడం ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాశంగా మారింది. ప్రస్తుతం రష్యా- ఉక్రెయిన్ మధ్య దాదాపు 2 ఏళ్లుగా సాగుతున్న యుద్ధం నేపథ్యంలో డబ్బులు సంపాదించుకు నేందుకు పాకిస్థాన్ ఉక్రెయిన్‌కు ఆయుధాలను అమ్ముకుంటోందని పేర్కొంది. ఈ ఆయుధా లను విక్రయించడంలో భాగంగా గత సంవత్సరం పాకిస్థాన్.. అమెరికాకు చెందిన 2 ప్రైవేట్ కంపెనీలతో ఆయుధ ఒప్పందాలు చేసుకుందని వెల్లడించింది. ఆ ఒప్పందం ద్వారా 364 మిలియన్ డాలర్లు అంటే మన భారత కరెన్సీలో రూ. 3 వేల కోట్లకు పైగా పాకిస్థాన్ సంపాదించినట్లు తెలుస్తుంది. రష్యాతో ఉక్రెయిన్ చేస్తున్న యుద్ధంలో భాగంగా ఉక్రెయిన్‌కు మందుగుండు సామగ్రిని సరఫరా చేయడం ద్వారా పాకిస్తాన్ ఈ రూ.3 వేల కోట్లను సంపాదించిందని పాక్ మీడియా తెలిపింది. అమెరికన్ ఫెడరల్ ప్రొక్యూర్‌మెంట్ డేటా సిస్టమ్ నుంచి వెల్లడైన ఈ ఒప్పందం వివరాల ప్రకారం.. అమెరికాకు చెందిన గ్లోబల్ మిలిటరీ, నార్త్రోప్ గ్రుమ్మన్ అనే రెండు కంపెనీలకు 155 ఎంఎం షెల్స్‌ను విక్ర యించేందుకు పాకిస్తాన్ ఒప్పందాలు చేసుకు ందని బీబీసీ ఉర్దూ ఒక కథ నాన్ని ప్రసారం చేసింది. అయితే డబ్బును సమకూర్చుకునేందుకు తాము ఆయుధాలను విక్రయించినట్లు వస్తున్న వార్తలు, కథనాలను పాకిస్థాన్ తీవ్రంగా ఖండించింది. ఉక్రెయిన్‌కు తాము ఎలాంటి మందుగుండు సామాగ్రిని అందించలేదని పాకిస్థాన్ స్పష్టం చేసింది. ఇక ఇదే విషయాన్ని ఇస్లామాబాద్‌లోని పాక్ విదేశాంగ కార్యాలయం కూడా వెల్లడిం చింది. ఉక్రెయిన్‌కు ఆయుధాలు, మందుగుండు సామగ్రిని విక్రయించినట్లు వస్తున్న ఆరోపణ లను



కొట్టిపారేసింది. ఈ మేరకు ఉక్రెయిన్, రష్యా మధ్య కొనసాగుతున్న యుద్ధంలో పాకిస్తాన్ రెండు దేశాల మధ్య తటస్థ విధానాన్ని కొనసాగిస్తోందని పాకిస్థాన్ విదేశాంగ కార్యాలయం తాజాగా ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ సందర్భంగా ఉక్రెయిన్‌కు వారికి ఎలాంటి ఆయుధాలు గానీ.. మందుగుండు సామాగ్రిని కానీ అమ్ముకోలేదని స్పష్టం చేసింది. అయితే ఈ ఒప్పందాలు జరిగినట్లు చెబుతున్న సమయంలో పాకిస్థాన్‌లో ఇమ్రాన్‌ఖాన్ నేతృత్వంలోని పాకిస్తాన్ డెమోక్రటి క్ మూవ్‌మెంట్ పాలనలో జరిగాయని పేర్కొంది. అయితే గత సంవత్సరం ఏప్రిల్‌లో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి ప్రధాని ఇమ్రాన్ ఖాన్ నేతృత్వంలోని పాకిస్థాన్ డెమోక్రటిక్ మూవ్‌మెంట్ ప్రభుత్వాన్ని.. పీఎండీ పార్టీ గద్దె దింపిందని తెలిపింది. 2022 ఫిబ్రవరి 24 వ తేదీన ఉక్రెయిన్‌పై సైనిక చర్యకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఆదేశించిన సమయంలో అప్పుడు ప్రధానిగా ఉన్న ఇమ్రాన్ ఖాన్ రష్యాలో పర్యటించినట్లు పాక్ తెలిపింది. మరోవైపు.. బీబీసీ ఉర్దూ ఇచ్చిన నివేదిక ప్రకారం.. అమెరికా కేంద్రంగా పనిచేసే గ్లోబల్ మిలిటరీ కంపెనీకి 232 మిలియన్ డాలర్లు అంటే మన కరెన్సీలో రూ.2 వేల కోట్ల విలువైన కాంట్రాక్టు లభించిందని తెలిపింది. ఇక నార్త్‌రోప్ గ్రుమ్మన్‌తో 131 మిలియన్ డాలర్లు అంటే రూ.వెయ్యి కోట్ల విలువైన మరో ఒప్పందంపై పాక్ సంతకం చేసిందని తెలుస్తోం ది. ఈ ఒప్పందాల గడువు అక్టోబర్ 2023 అంటే గత నెలతో ముగిసింద ని బీబీసీ ఉర్దూ నివేదికలో వెల్లడైంది. నూర్ ఖాన్ ఎయిర్ బేస్ నుంచి ఐదుసార్లు రావల్పిండిలో ల్యాండ్ అయిన బ్రిటిష్ మిలటరీ కార్గో విమానంలో ఆ ఆయుధాలను సరఫరా చేశారని ఈ నివేదికలో ఆరోపణలు ఉన్నాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో పాకిస్థాన్ ఆయుధాల ఎగుమతులు 3 వేల శాతం పెరిగాయని స్టేట్ బ్యాంక్ ఆఫ్ పాకిస్థాన్ డేటా కూడా ప్రకటించిందని బీబీసీ ఉర్దూ సాక్ష్యాలను కూడా వెల్లడించింది. పాకిస్తాన్ 2021-22లో 13 మిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో రూ.100 కోట్ల విలువైన ఆయుధాలను ఎగుమతి చేయగా.. 2022-23 లో 415 మిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో రూ.3500 కోట్లకు చేరుకున్నాయని పేర్కొంది.



# మంచు విష్ణుకి ఏమైంది..

'కన్నప్ప' సినిమా తర్వాత నటనకు బ్రేక్ ఇచ్చిన విష్ణు మంచు తాజాగా తిరుపతిలో మోహన్‌బాబు యూనివర్సిటీ రెండో గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివమణి, విజయ్ దర్డాలకు డాక్టరేట్‌లు అందజేశారు. ఈ వేడుకలో విష్ణు లుక్ చూసి అభిమానులు, నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు. చలాకీగా కనిపించే ఆయన ఈసారి చిక్కిపోయినట్లుగా, బలహీనంగా కనబడడంతో ఆరోగ్యంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ఆయన సినిమా ప్రమోషన్లకు దూరంగా ఉంటూ కుటుంబంతో టైమ్ గడుపుతున్నారు. 'కన్నప్ప' ఓటీటీ రిలీజ్ డేట్ ఇంకా ఖరారవ్వలేదు.


ఇటీవలే ' కన్నప్ప ' చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు మంచు విష్ణు . తానే హీరోగా స్వీయ నిర్మాణంలో ఈ చిత్రాన్ని తెరకెక్కించిన విష్ణు దీనికోసం ఎన్నో వ్యయ ప్రయాసలకు గురయ్యాడు. అయితే ఇది తన డ్రీమ్ ప్రాజెక్టు కావడంతో అన్నింటినీ భరించి ఎట్టకేలకు ప్రాజెక్టును పూర్తిచేసి ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చాడు. ఈ మూవీలో ప్రభాస్, మోహన్‌లాల్, అక్షయ్‌కుమార్, శరత్‌కుమార్, కాజల్ అగర్వాల్, మధుబాల వంటి స్టార్లు నటించడంతో ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. దానికి తగినట్లుగానే ఫస్ట్ లుక్స్, టీజర్, ట్రైలర్ మరింత హైప్ తీసుకొచ్చాయి. దీంతో చానాళ్ల తర్వాత విష్ణు బ్లాక్‌బస్టర్ అందుకోబోతున్నాడని ఆయన ఫ్యాన్స్ ఆశించారు. ప్రమోషన్లలో అంతా తానొక్కడై వరుస ఇంటర్వ్యూలు ఇస్తూ బాగా కష్టపడ్డాడు.

విష్ణు ఆశించినట్లు 'కన్నప్ప'కి తొలిరోజు మంచి టాకే వచ్చింది. కలెక్షన్లు కూడా ఆశించిన స్థాయిలోనే ఉన్నాయి. అయితే మూడు రోజులు గడిచేసరికి కలెక్షన్లు బాగా వీక్ అయిపోయాయి. దీంతో వారం తిరిగేసరికి చాలా థియేటర్లలో తీసేయాల్సిన పరిస్థితి వచ్చింది. ఈ చిత్రంతో తమకు నష్టం రాలేదని మంచు ఫ్యామిలీ చెబుతున్నా.. మార్కెట్‌లో మాత్రం మరో టాక్ ఉంది. బడ్జెట్‌లో కనీసం సగం కూడా రాబట్టలేకపోయినట్లు ఇండస్ట్రీలో చాలామంది చెబుతున్నారు. అయితే అసలు కథని పక్కనపెట్టి అవసరం లేని పాత్రలు క్రియేట్ చేయడం, తెగల మధ్య పోరాటాలు చూపించడం, ఫస్టాఫ్‌లో కాస్త రక్తి ఎక్కువ కావడంతో సినిమా తేడా కొట్టేసిందని చాలామంది అభిప్రాయపడ్డారు.

'కన్నప్ప' రిలీజ్ వరకు మీడియాలో సందడి చేసిన మంచు విష్ణు మళ్లీ ఎక్కడా కనిపించలేదు. ఆయన మరో చిత్రాన్ని లైన్లో పెట్టబోతున్నారని వార్తలొచ్చినా దానిపై క్లారిటీ రాలేదు.

'కన్నప్ప' తర్వాత సినిమాలకు కాస్త గ్యాప్ ఇచ్చిన విష్ణు ఆ టైమ్‌ని ఫ్యామిలీతో ఎంజాయ్ చేస్తున్నారు. అంతేకాకుండా విద్యానికేతన్, మోహన్‌బాబు యూనివర్శిటీల వ్యవహారాల్లో బిజీగా ఉన్నారు. తాజాగా ఆయన మోహన్‌బాబు యూనివర్శిటీ స్నాతకోత్సవంలో సందడి చేశారు. ఈ సందర్భంగా డ్రమ్స్ కళాకారుడు శివమణి, మీడియా ఫీల్డ్‌కు చెందిన విజయ్ దర్డాలకు ప్రకటించిన డాక్టరేట్‌ను పెద్దల సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా దిగిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా నెటిజన్లు విష్ణు లుక్‌పై భిన్నంగా స్పందిస్తున్నారు. సినిమాలో, మూవీ ప్రమోషన్లలో ఎంతో చలాకీగా, యాక్టివ్‌గా కనిపించిన ఆయన ఈ ఫోటోల్లో చాలా నీరసంగా కాస్త బక్కగా కనిపిస్తున్నారు. దీంతో ఆయన అనారోగ్యంగా బాధపడుతున్నారా? అని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. కన్నప్ప హెయిర్ స్టైల్‌నే కంటిన్యూ చేస్తున్న విష్ణు మొహంలో మాత్రం ఆ కళ కనిపించడం లేదని అంటున్నారు. దీంతో ఆయనకి ఏమైందోనని ఆరా తీస్తున్నారు.





# కాంతార 3లో తారక్?

కన్నడ స్టార్ హీరో, జాతీయ ఉత్తమ నటుడు రిషబ్‌శెట్టి కెరీర్‌నే మార్చేసిన సినిమా ' కాంతార ' అప్పటివరకు కన్నడ ప్రేక్షకులకి తప్ప ఇతర భాషల ప్రేక్షకులకి పరిచయం లేని రిషబ్.. ఈ మూవీతో ఒక్క రాత్రిలో స్టార్ అయిపోయాడు. ఆయన నటనకు ప్రేక్షకులు ఫిదా అయిపోయారు. కన్నడ స్టార్ కాస్తా పాన్ ఇండియా స్టార్‌గా మారిపోయాడు. ఎలాంటి అంచనాలు లేకుండా వచ్చిన ఈ మూవీ ఇండియన్ బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపించింది. ఈ నేపథ్యం లోనే 'కాంతార'కు ప్రీక్వెల్ తీస్తున్నారు మేకర్స్. 'కాంతార' చిత్రానికి ముందుకు ఏం జరిగింది అన్నది స్టోరీ లైన్‌గా ఉంటుందని తెలుస్తోంది. ఫస్ట్ పార్ట్ మాదిరిగానే ఇందులోనూ రిషబ్ శెట్టి నటించడంతో పాటు దర్శకత్వం కూడా వహించారు. ఈ చిత్రం ఇప్పటికే షూటింగ్ పూర్తిచేసుకోగా అక్టోబర్ 2న రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అయితే 'కాంతార 2' ఇంకా విడుదల కాకుండా మూడో పార్ట్ కూడా తీసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇది 'కాంతార'కు సీక్వెల్‌గా ఉండబోతోందట. 'కాంతార 2' రిలీజ్ అయ్యాక ఈ చిత్రం పట్టాలెక్కనుందని టాక్ వినిపిస్తోంది. అయితే అది నిజం కాదని తెలుస్తోంది. ఎందుకంటే రిషబ్ శెట్టి చేతిలో ఇప్పటికే మూడు నాలుగు చిత్రాలు ఉన్నాయి. ఛత్రపతి శివాజీ బయోపిక్, 'జై హనుమాన్' చిత్రాలతో పాటు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లో ఓ పీరియాడికల్ యాక్షన్ డ్రామా చేతిలో ఉన్నాయి. ఈ ప్రాజెక్టులన్నీ పూర్తయ్యాకే 'కాంతార 3'ని సెట్స్ మీదికి తీసుకెళ్లనున్నాడట రిషబ్. 'కాంతార' ఫ్రాంచైజీలో మూడు చిత్రాలకు కలిపి రూ.200 కోట్ల వరకు రెమ్యునరే షన్ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం... 'కాంతార 3'లో యంగ్ టైగర్ ఎన్టీఆర్ నటించనున్నారట. ఇందుకు సంబంధించి ఆయనతో చర్చ లు కూడా ముగిశాయని టాక్. ఇదే నిజమైతే మాత్రం ఈ మూవీ మరోస్థాయికి చేరడం ఖాయం. రిషబ్ శెట్టి, ఎన్టీఆర్ మంచి స్నేహితులు అన్న సంగతి తెలిసిందే. తన తల్లి శాలిని స్వరాష్ట్రం కర్ణాటక కావడంతో ఆయన కన్నడ బాష కూడా అనర్గళంగా మాట్లాడతారు. దీంతో ఎన్టీఆర్ 'కాంతార 3'లో నటించబోతున్నారన్న వార్త ఆసక్తికరంగా మారింది. ఎన్టీఆర్ తాజాగా నటించిన 'వార్ 2' సినిమా ఈ నెల 14న రిలీజ్ కానున్న సంగతి తెలిసిందే. ఈ మూవీతో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టిన ఎన్టీఆర్... 'కాంతార 3'తో కన్నడ ఇండస్ట్రీలోనూ అడుగుపెట్టడానికి సిద్ధంగా ఉన్నాడు. ప్రస్తుతం ఎన్టీఆర్ చేతిలో అనేక భారీ ప్రాజెక్టులు ఉన్నాయి. కన్నడ స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్‌తో ఆయన ఓ చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. 'దేవర 2' కూడా త్వరలోనే పట్టాలెక్కేందుకు సిద్ధమైంది.



# వెండితెరపై నరసింహుడి ఉగ్ర తాండవం

సుమారు ?15 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన యానిమేటెడ్ చిత్రం 'మహావతార్ నరసింహ' తొలి రోజు కేవలం ?1.75 కోట్లు మాత్రమే రాబట్టింది. అయితే మౌత్ టాక్‌తో పెరుగుతున్న క్రేజ్ నేపథ్యంలో ప్రేక్షకులు భారీగా థియేటర్లు పెంచారు. కేవలం 8 రోజుల్లోనే ?60.5 కోట్లు వసూలు చేసి దేశంలో అత్యధిక వసూళ్లు సాధించిన యానిమేటెడ్ సినిమాగా రికార్డు సృష్టించింది. శని, ఆదివారాల్లో బంపర్ కలెక్షన్లతో 10 రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా ?105 కోట్లు రాబట్టి చరిత్రను నమోదు చేసింది. ఇది భారతీయ యానిమేషన్ సినిమాల చరిత్రలో ఓ మైలురాయిగా నిలిచింది.

ఒక సినిమా హిట్టు కావాలంటే ఎంత ఎక్కువ బడ్జెట్‌తో తీశామన్నది కాదు.. ప్రేక్షకులకి ఎంత కనెక్ట్ అయ్యేలా తీశామన్నదే ముఖ్యం. స్టార్ హీరోలు లేవు, హీరోయిన్‌తో రొమాన్స్ సీన్లు లేవు, ఐటెం సాంగ్స్ లేవు, బూతుల్లేవ్, విసిగించే కామెడీ లేదు... అసలు ఈ సినిమాలో మనుషులే నటించలేదు. కానీ ఇండియన్ బాక్సాఫీస్‌ని షేక్ చేసి పారేస్తోంది. అదే ' మహావతార్ నరసింహ ' యానిమేషన్ సినిమా. ఎలాంటి ప్రచార ఆర్భాటాలు లేకుండా చిన్న సినిమాగా తక్కువ థియేటర్లలో రిలీజైన ఈ మూవీ దేశవ్యాప్తంగా ప్రభంజనం సృష్టిస్తోంది. కేజీఎఫ్, కేజీఎఫ్ 2, కాంతార, సలార్.. లాంటి భారీ చిత్రాలను అందించిన హొంబలే ఫిల్మ్స్ బ్యానర్, క్లీమ్ ప్రొడక్షన్స్‌తో కలిసి మహావతార్ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా ఈ చిత్రాన్ని నిర్మించింది. జులై 25న విడుదలైన ఈ మూవీకి ప్రేక్షకులు బ్రహ్మరథం చేపడుతున్నారు. ప్రహ్లాదుడి చరిత్ర.. మహా విష్ణువుకు, రాక్షస రాజు హిరణ్యకశిపునికి మధ్య యుద్ధం వంటి అంశాలతో 'మహావతార్ నరసింహ' చిత్రాన్ని రూపొందించారు. దీనికి అశ్విన్ కుమార్ దర్శకత్వం వహించారు.

సుమారు రూ.15 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన 'మహావతార్ నరసింహ' తొలిరోజు కేవలం రూ.1.75 కోట్లు మాత్రమే రాబట్టింది. అయితే మౌత్ టాక్ బాగుండటంతో ప్రేక్షకులు థియేటర్లకు క్యూ కట్టారు. రోజురోజుకీ కలెక్షన్లు పెరుగుతుండటంతో కేవలం 8 రోజుల్లోనే ?60.5 కోట్లు వసూలు చేసి భారతదేశంలో అత్యధిక వసూళ్లు సాధించిన యానిమేటెడ్ చిత్రంగా ఆల్ టైమ్ రికార్డ్ క్రియేట్ చేసింది. అయితే శని, ఆదివారాల్లో చిత్రం భారీ కలెక్షన్లు రాబట్టింది. 10 రోజులు రన్ పూర్తయ్యేసరికి ప్రపంచవ్యాప్తంగా రూ.105 కోట్లు కలెక్ట్ చేసి చరిత్ర సృష్టించింది.

'మహావతార్ నరసింహ' దెబ్బకి పవన్ కళ్యాణ్ నటించిన 'హరిహర వీరమల్లు' సినిమాకి గట్టి దెబ్బే తగిలింది. 10 రోజుల రన్ పూర్తయినా ఈ మూవీ ప్రభంజనం ఇప్పట్లో ఆగేలా కనిపించడం లేదు. ఈ మూవీ ఘన విజయం సాధించడంతో ఈ సిరీస్‌లో రాబోయే చిత్రాలపై అప్పుడే అంచనాలు మొదలయ్యాయి. 'మహావతార్ నరసింహ' చిత్ర విజయంతో మరిన్ని యానిమేటెడ్ చిత్రాలు వచ్చే అవకాశాలున్నాయని ఇండస్ట్రీ వర్గాలు అంటున్నాయి.

# తిరుమలలో నామకరణం

యంగ్ హీరో కిరణ్ అబ్బవరం, రహస్యా గోరక్ తమ బిడ్డ నామకరణ కార్యక్రమాన్ని తిరుమల శ్రీవారి సన్నిధిలో నిర్వహించారు. తమ కుమారుడికి 'హను అబ్బవరం' అనే పేరు పెట్టారు. దర్శనం అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందించారు. "శ్రీవారి సన్నిధిలో బాబుకి నామకరణం చేయడం ఎంతో ఆనందంగా ఉంది. స్వామి అనుగ్రహం ఎల్లప్పుడూ మన కుటుంబంపై ఉండాలని ఆశిస్తున్నాం" అని కిరణ్ అన్నారు. సినిమాల విషయానికొస్తే.. ప్రస్తుతం 'కే ర్యాంప్', 'చెన్నై లవ్ స్టోరీ' షూటింగ్‌లో ఉన్నారని, త్వరలో మరో సినిమా ప్రారంభం కానుందని తెలిపారు.

షార్ట్ ఫిల్మ్స్ ద్వారా ఫేమస్ అయి 'రాజావారు రాణిగారు' చిత్రంలో హీరోగా మారాడు కడప కుర్రాడు కిరణ్ అబ్బవరం . తొలి చిత్రంతోనే హిట్టు కొట్టి ఇండస్ట్రీలోకి గ్రాండ్ ఎంట్రీ ఇచ్చాడు. ఆ తర్వాత ఎస్ఆర్ కల్యాణ మండపం, సెబాస్టియన్ పీ 524, సమ్మతమే, నేను మీకు బాగా కావాల్సిన వాడిని, వినరో భాగ్యము విష్ణుకథ, రూల్స్ రంజన్.. ఇలా



వరుస చిత్రాలతో ఇండస్ట్రీలో నిలదొక్కుకున్నాడు. అయితే ఎస్ఆర్ కల్యాణ మండపం మూవీ తప్ప మిగిలినవన్నీ ఫ్లాప్ కావడంతో కిరణ్ అబ్బవరం పని ఇక అయిపోయిందన్న టాక్ ఇండస్ట్రీలో మొదలైంది. ఆ తర్వాత కసితో 'క' మూవీ తీసి బ్లాక్‌బస్టర్ అందుకున్నాడు. ఆ దెబ్బతో తనను విమర్శించిన వాళ్ల నోళ్లు మూయించాడు.

తన తొలి సినిమాలో హీరోయిన్‌గా నటించిన రహస్య గోరక్‌కి ప్రేమించి పెళ్లాడిన కిరణ్ ఇటీవలే తండ్రిగా ప్రమోషన్ పొందాడు. సోమవారం భార్య, కుమారుడితో కలిసి తిరుమలకు వచ్చిన ఆయన శ్రీవారి దర్శనం చేసుకున్నారు. తన కొడుక్కి శ్రీవారి సన్నిధిలోనే నామకరణం కూడా చేయించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... కుమారుడు పుట్టాక తొలిసారి శ్రీవారి సన్నిధికి వచ్చామని, దర్శనం బాగా జరిగిందన్నారు. తన కొడుక్కి స్వామివారి సన్నిధిలో నామకరణం చేయించామన్నారు. హనుమాన్ జయంతి రోజును పుట్టడంతో 'హను అబ్బవరం'గా నామకరణం చేశామని తెలిపారు. ఇక సినిమాల విషయానికొస్తే.. ప్రస్తుతం కే ర్యాంప్, చెన్నై లవ్ స్టోరీ చిత్రాల్లో నటిస్తున్నానని, ఈ నెల రెండో వారంలో మరో సినిమా ప్రారంభం కానుందని కిరణ్ అబ్బవరం తెలిపాడు.



# ఈ జీవితం అభిమానులు ఇచ్చిందే...

ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేకపోయినా సినీ ఇండస్ట్రీలో రాణించి స్టార్ హీరోగా ఎదగొచ్చని నిరూపించాడు అజిత్ కుమార్. కెరీర్ తొలినాళ్లలో లవర్ బాయ్ ఇమేజ్ తెచ్చుకున్న ఆయన ఆ తర్వాత మాస్ హీరోగా మారి తమిళ ఇండస్ట్రీనే శాసించే స్థాయికి చేరుకున్నాడు. కోట్లాది మందికి అభిమాన హీరో అయ్యాడు. ఓవైపు సినిమాలు చేస్తూనే.. మరోవైపు తనకెంతో ఇష్టమైన కార్ రేసింగుల్లో పాల్గొంటూ తన అభిరుచిని చాటుకుంటున్నాడు. అజిత్ సినీ ఇండస్ట్రీకి వచ్చి 33 ఏళ్లయింది. ఈ సందర్భంగా తనను అభిమానులను ఉద్దేశించి ఓ ఎమోషనల్ పోస్ట్ పెట్టాడు. తన సినీ ప్రయాణంలో అండగా ఉన్న అభిమానులకు జీవితాంతం రుణపడి ఉంటానని చెప్పిన అజిత్.. తన జర్నీలో ఎన్నో ఇబ్బందులు పడ్డానని, ఎత్తుపల్లాలని చూశానంటూ ఎమోషనల్ అయ్యారు.

'సినీ ఇండస్ట్రీలో 33 ఏళ్లు పూర్త య్యాయి. ఈ సందర్భంగా అభిమానులతో ఎన్నో విషయాలు పంచుకోవాలనుంది. గడిచిన ప్రతి సంవత్సరం నాకో మైలురాయితో సమానం. నాపై చూపించే ప్రేమకు అందరికీ ఎలా కృతజ్ఞతలు చెప్పాలో కూడా తెలియడం లేదు. జీవితంలో ఎన్నో ఒత్తిడులు, ఎదురుదెబ్బలు, వైఫల్యాలు పరీక్షించినా నేను ఎప్పుడూ ఆగిపోలేదు. అన్నింటినీ ఎదుర్కొంటూనే ముందుకు సాగాను. అన్నింటినీ భరిస్తూ పడిలేచిన కెరటంగా మరింత ఉత్సాహంతో ముందుకు సాగిపోతూనే ఉన్నాను. పట్టుదలే నేను ఎంచుకున్న మార్గం. అదే నా బలం. స్టార్ హీరోగా ఎదిగిన ఈ ప్రయాణంలో ఎన్నో ఊహించని పరాజయాలు, పరాభవాలు ఎదుర్కొన్నాను.


'సినిమా రంగంలోనే కాదు మోటార్ రేసింగులోనూ ఎన్నో ఎదురెదెబ్బలు తగిలాయి. శారీకరంగా ఎన్నో గాయాలయ్యాయి. అక్కడ కూడా నేను ఎదగకుండా ఎంతోమంది కుట్రలు చేశారు. అవమానిస్తూ పరీక్షలు పెట్టారు. అవన్నీ తట్టుకుని ఇప్పుడు పతకాలు సాధించే స్థాయికి ఎదిగాను. ధైర్యంగా అడుగేస్తే జీవితంలో ఏదైనా సాధించొచ్చని నిరూపించాను. నా భార్య షాలిని లేకపోతే ఇదంతా సాధ్యమయ్యేది కాదు. సుఖాల్లోనే కాదు కష్టాల్లోనూ నా వెన్నంటే నిలిచింది. ఇక అభిమానుల ప్రేమ గురించి మాటల్లో వర్ణించలేను. మీ ప్రేమను ఎప్పుడూ వ్యక్తిగత ప్రయోజనాల కోసం వాడుకోలేదు. మిగతా హీరోల మాదిరిగా నేను ఎక్కువ సినిమాలు తీయకపోవచ్చు, మిమ్మల్ని ఎక్కువగా కలవకపోవచ్చు కానీ మీ ప్రేమను మాత్రం ఎప్పుడూ ఆస్వాదిస్తూనే ఉంటాను. 33 ఏళ్లుగా నా లోపాలను అన్నింటినీ అంగీకరిస్తూనే నన్ను భరిస్తూ వచ్చారు. మీతో ఎప్పటికీ నిజాయతీగా ఉండటానికి ప్రయత్నిస్తూనే ఉంటాను' అంటూ ఎమోషనల్ అయ్యారు అజిత్.



# షూటింగ్ అడ్డగింత

ఫిలిం ఛాంబర్ అంగీకరించకపోవడంతో షూటింగులు నిలిచిపోయాయి. అయితే మైత్రి మూవీ మేకర్స్ మాత్రం పవన్ కళ్యాణ్ హీరోగా తెరకెక్కుతోన్న 'ఉస్తాద్ భగత్ సింగ్' షూటింగ్‌ను కొనసాగిస్తోంది. సీనియర్ ఆర్టిస్టుల డేట్స్ ఉండటంతో షూటింగ్ ఆపితే నష్టం కలుగుతుందని ముంబయి నుండి కార్మికులను తెప్పించి అన్నపూర్ణ స్టూడియోలో షూటింగ్ చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న యూనియన్ నేతలు అక్కడకు వెళ్లి షూటింగ్ ఆపే ప్రయత్నం చేయడంతో వాగ్వాదం చోటు చేసుకుంది. తెలుగు సినీ పరిశ్రమలో కార్మిక సంఘాల బంద్ మొదలైంది. తమకు 30 శాతం వేతనాలు పెంచకపోతే సోమవారం నుంచి బంద్ చేస్తామని ఫిల్మ్ వర్కర్స్ ఫెడరేషన్ పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. తమకు వేతనాలు పెంచుతామని ఒప్పుకున్న నిర్మాతల చిత్రాలకు తప్ప మిగతావారి సినిమాల షూటింగులకు పనిచేయబోమని వారు హెచ్చరించారు. అయితే వారి డిమాండ్‌కు ఫిల్మ్ ఛాంబర్ ససేమిరా ఒప్పుకోలేదు. కార్మికులకు ఇప్పటికే ఎక్కువ వేతనాలు ఇస్తున్నామని... మళ్లీ 30 శాతం పెంపు అంటే తమవల్ల కాదని ఫిల్మ్ ఛాంబర్ ప్రతినిధులు తేల్చిచెప్పారు. నిర్మాత లెవరూ భయపడి వర్కర్స్ ఫెడరేషన్‌తో ప్రైవేట్ ఒప్పందాలు చేసుకోవద్దని సూచించారు. ఫిల్మ్ ఫెడరేషన్, ఫిల్మ్ ఛాంబర్ మధ్య చర్చలు విఫలం కావడంతో సోమవారం నుంచి తెలుగు సినీ పరిశ్రమలో బంద్ సైరన్ మోగింది. కార్మికులెవరూ షూటింగులకు వెళ్లకుండా తమ నిరసన తెలియ జేస్తున్నారు.

# 'రాంఝానా' మేకర్స్‌పై ధనుష్ ఆగ్రహం



కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ కి తమిళంతో పాటు తెలుగు, హిందీ ఇండస్ట్రీల్లోనూ మంచి ఫాలోయింగ్ ఉంది. కథ నచ్చితే ఏ భాషలో అయినా ఏ డైరెక్టర్‌తో అయినా నటించేందుకు ఆయన సిద్ధంగా ఉంటారు. ఇటీవల 'కుబేర' అనే చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి హిట్ అందుకున్నారు. మరోవైపు 'ఇడ్లీ కడై' తో త్వరలోనే మరోసారి ప్రేక్షకుల్ని పలకరించేందుకు సిద్ధమవుతున్నారు. గతంలో ధనుష్ హిందీలో నటించిన ' రాంఝానా ' చిత్రం ఆగస్టు 1న రిలీజ్ అయింది. 2013లో వచ్చిన ఈ మూవీ బాలీవుడ్‌లో ధనుష్‌కి డెబ్యూ మూవీ కావడం విశేషం. రొమాంటిక్ జోనర్‌లో వచ్చిన ఈ చిత్రానికి ఆనంద్ ఎల్.రాయ్ దర్శకత్వం వహించారు. ఇందులో ధనుష్‌కి జోడీగా సోనమ్ కపూర్ నటించింది. అయితే తాజాగా రీరిలీజ్ అయిన ఈ చిత్రానికి క్లైమాక్స్ మార్చేశారు మేకర్స్. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఆల్టర్నేట్ క్లైమాక్స్‌ని క్రియేట్ చేసి థియేటర్లలోకి తీసుకొచ్చారు. ఈ చర్యపై ధనుష్ తీవ్రంగా మండిపడ్డారు. ఓ నోట్ రూపంలో తన ఆవేదనని తెలియజేస్తూ ట్వీట్ చేశారు. ""రాంఝానా" చిత్రాన్ని ఏఐ సహాయంతో మారుస్తూ తిరిగి విడుదల చేయడమొక భయానక అనుభూతిని కలిగించింది. ఈ కొత్త ముగింపు ఆ సినిమా ఆత్మను పూర్తిగా తుడిచేసింది. ఇది నా స్పష్టమైన అభ్యంతరాన్ని పట్టించుకోకుండా జరిగిన పని. 12 సంవత్సరాల క్రితం నేను అంగీకరించిన సినిమా ఇదికాదు.

Printed, Edited by , Published and Owned by .M Chandrasekhar Address Plot No 12. Journalist. Colony .Near. B.T.R.Nagar. vaartha Office Back Side .KG Road. Kurnool. Andhra Pradesh .Pincode 518 001
Printed at Uttejitha printer's, KURNOOL. AP. Cell No. 9440140418, RNI APTEL/2008/24570 ,